ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శుక్రవారం 14 ఆగస్టు 2026 | సంపుటి: 1 సంచిక: 58 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## ఆహార పదార్థాల ప్యాకెట్లపై
## లేబుల్ వేయాల్సిందే

**పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు**

**మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం**

**కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు**



అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది.

**న్యూఢిల్లీ,ఆగస్ట్13 (సింగిడి)**

2



2

## ఢిల్లీ పేలుళ్ల వెనుక
## అల్‌ఖైదా కుట్ర

ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడి



## 'సర్' పేరుతో కాల్స్,
## ఎస్సెమ్మెస్‌లు

### ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక

- **ఓటరు జాబితా సవరణ పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**
- **ఫారం తిరస్కరణకు గురైందంటూ రూ.5 కట్టాలని మోసపూరిత సందేశాలు**
- **బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు చెప్పొద్దని అధికారుల సూచన**
- **ఎన్నికల సంఘం ఇలాంటి కాల్స్ చేయదని, డబ్బులు అడగదని స్పష్టీకరణ**
- **అనుమానిత సందేశాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం హెచ్చరించారు. నగదుతో పాటు సున్నితమైన బ్యాంకింగ్ వివరాలను దొంగిలించేందుకు కొందరు మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు పంపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాల గురించి సీఈఓ కార్యాలయం సవివరంగా వెల్లడించింది.

2

**- హైదరాబాద్,ఆగస్ట్13 (సింగిడి)**

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన
# ఘనత కాంగ్రెస్‌దే

### కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు

**ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి**

**మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**

2






ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు.

**- హైదరాబాద్,ఆగస్ట్13 (సింగిడి)**

## వేలంవెర్రిగా భూముల అమ్మకం

### ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం

**రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి**

**సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ**

2



రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు.

**- హైదరాబాద్,ఆగస్ట్13 (సింగిడి)**

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి
# సీఎం భూమిపూజ

**పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా**

**సీఎం రేవంత్ సెన్సేషనల్ కామెంట్స్**

**కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన**

**పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్న సీఎం**

2

*గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరంలోని కేపీ హెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. పేదల రుణం తీర్చుకునేందుకు అవకాశం వచ్చిందని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.*

**హైదరాబాద్,ఆగస్ట్13 (సింగిడి):**





## త్వరలో కోల్ ఎక్స్చేంజ్

**దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

2

దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్చేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**- న్యూఢిల్లీ,ఆగస్టు13 (సింగిడి)**

## పకడ్బందీగా పంద్రాగస్టు ఏర్పాట్లు

### ప్రోటోకాల్ తప్పక పాటించాలి

**విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి**

**అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**

2



రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ వాటర్‌ప్రూఫ్ జనరేటర్, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు.

**- హైదరాబాద్,ఆగస్టు13 (సింగిడి)**



## ముగిసిన పార్లమెంట్
## వర్షాకాల సమావేశాలు

2

### వందేమాతరం గీతాలాపనతో లోక్ సభ వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోకసేభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు.

**న్యూఢిల్లీ,ఆగస్టు13 (సింగిడి)**

## నకిలీలకు చెక్

**9 సెక్యూరిటీ ఫీచర్లతో తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులు!**




**ఆగస్టు 15 నుంచి తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**నకిలీలను అరికట్టేందుకు 9 రకాల భద్రతా ఫీచర్ల జోడింపు**

**సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారిక ప్రారంభం**

**ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని వెల్లడి**

2

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

### అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు

**ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం**

**వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం**

2



రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు.

**- కర్నూలు,ఆగస్ట్13 (సింగిడి)**

## అమరావతి నిర్మాణం
# రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక

**అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా**

**రైతులను భాగస్వాములను చేసేందుకే ల్యాండ్ పూలింగ్**

**గ్రాఫిక్స్ అన్నవారికి చెంపపెట్టులా నిర్మాణాలు**

**స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు**

అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారు ముందుకు రాకుంటే ఇవాళ రాజధాని నిర్మాణాన్ని ఊహించలేమని అన్నారు.గత ప్రభుత్వం వారిని కేసులతో అనేక ఇబ్బందులకు గురిచేసినా, రాజధాని కోసం త్యాగాలకు వెరవలేదని అన్నారు. రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ–3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

**- అమరావతి,ఆగస్ట్13 (సింగిడి)**

2





## రాజధాని నిర్మాణంలో
## మరో కీలక ఘట్టం

**ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు ప్రారంభించిన చంద్రబాబు**

2

అమరావతి రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధానిలో నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.

**అమరావతి,ఆగస్ట్13 (సింగిడి)**

# 'సర్' పేరుతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు

"ఓటరు గుర్తింపు కార్డులోని వివరాలు, 'సర్' ఫారంలోని వివరాలతో సరిపోలడం లేదని, అందుకే మీ దరఖాస్తు తిరస్కరణకు గురైందంటూ ఓటర్లకు సందేశాలు పంపుతున్నారు. సవరణ కోసం ఒక నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయాలని వారు సూచిస్తున్నారు. ఆ తర్వాత, నామమాత్రంగా రూ.5 చెల్లించాలని కోరుతూ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ /డెబిట్ కార్డుల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, సీవీవీ నంబర్లు, ఏటీఎం పిన్‌ల వంటి అత్యంత రహస్య సమాచారాన్ని కాజేసే ప్రయత్నం చేస్తున్నారు" అని సీఈవో వివరించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ, తెలంగాణ సీఈఓ కార్యాలయం కానీ ఓటర్లకు ఇటువంటి సందేశాలు పంపదని, ఫోన్ కాల్స్ చేయదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటువంటి మోసపూరిత సమాచారాన్ని నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత, ఆర్థిక వివరాలను పంచుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.
ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇటువంటి మోసాలు జరుగుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే అధికారిక ఈసీఐ ప్లాట్‌ఫారమ్‌లను సంప్రదించాలని లేదా నేరుగా తమ బూత్ స్థాయి అధికారులను కలవాలని అధికారులు సూచించారు.

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోకసేభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీకకు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్

అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయం లోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగస్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగు తుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విర గ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వా మ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించా లని జగన్ పిలుపునిచ్చారు.


## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా కుట్ర

### ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు13 (సింగిడి)**
ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారులో జరిగిన పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ 'అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ (AQIS)' కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. AQIS ను ప్రాంతీయ కార్యకలా పాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తున్నది. తాలిబన్ల నుంచి AQIS కు మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తన నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దాంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమ వుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు AQIS ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతావర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. AQIS తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో AQIS కు పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్–1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్–1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం.



టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్–1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్–1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్–1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్–1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.
విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి

# సీఎం భూమిపూజ

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నేతలపై రేవంత్ రెడ్డి పలు విమర్శలు గుప్పించారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారని మండిపడ్డారు.
పేదల సొంతింటి కలను నెరవేరుస్తా : పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అండగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించామని వివరించారు. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ లోన్లు అందించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని గుర్తుచేశారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న సీఎం, రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు 1000 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. శిల్పారామం వద్ద రూ.వెయ్యి కోట్లతో ఇందిరా మహిళాశక్తి స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని, ఓ వైపు వాటన్నింటినీ తీర్చుకుంటూనే మరోవైపు




సంక్షేమం వైపు దృష్టి పెడుతున్నామని సీఎం తెలిపారు.
"క్షుద్ర పూజల కోసం కొందరు కర్ణాటకకు పోయారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్ర పూజలు చేశాడు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడుతుంది. రాష్ట్ర బాగు కోసం నా సంకల్పం అందుకే వర్షాలు పడుతున్నాయి"–రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

ఆ విషయంలో ఆందోళన అక్కర్లేదు : ఈ సందర్భంగా 22–ఎ భూముల అంశంపై రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22–ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాననన్నారు. ఈ విషయంలో తనదీ పూచీ అని చెప్పారు. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారన్న సీఎం, సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని'అని సీఎం తెలిపారు.

# పకడ్బందీగా పంద్రాగస్టు ఏర్పాట్లు

కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజరు కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్టిక్ట ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక


సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జీల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నామని, రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం కాని పరిస్థితి అన్నారు. శివరామ కృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. కేవలం ఓ 50 ఎకరాల్లో భవనాలు నిర్మించవచ్చని, అయితే భవిష్యత్ ఏం కావాలన్న ప్రశ్న ఉదయించడంతో అమరావతి నిర్మాణానికి పూనుకున్నామని అన్నారు. అయితే ఇందుకోసం భూములు కావాలి కదా మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని నాటి సంగతులను సీఎం చంద్రబాబు వివరించారు.సింగపూర్ మోడల్‌తో అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ ప్రభుత్వం ఉచితంగా ప్లాన్ ఇచ్చారని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి కనెక్టివిటీ పెరగనుందని పేర్కొన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించా నని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రైతులు లేకపోతే రాజధాని లేదని చెప్పుకొచ్చారు. ఆనాడు అమెరికాలో పర్యటించి.. సైబరాబాద్ రూపకల్పన చేశామని ప్రస్తావించారు. రూపాయి తీసుకోకుండా అమరావతి కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ రూపొందించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు. హైదరాబాద్ ఆదాయం పెరగడానికి తాను చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు.

## ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే

ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## వేలంవెర్రిగా భూముల అమ్మకం

'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందర పడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు.




## రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం

### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు ప్రారంభించిన చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్13 (సింగిడి): అమరావతి రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధానిలో నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. గురువారం నూతన భవన సముదాయాన్ని సీఎం చేతుల మీదుగా సాధారణ పరిపాలన శాఖ జీఏడీకి సీఆర్డీఏ అప్పగించింది. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస భవన సముదాయాన్ని నిర్మించారు. ఒక్కొక్కటి 3,500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ఫ్లాట్లను సీఆర్డీఏ నిర్మించింది. అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించిన సీఆర్డీఏ.. టవర్స్ మధ్య ప్రత్యేక లాన్స్‌ను పెంచింది. అధునాతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫ్లాట్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఇక, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల అప్పగింత అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సాధారణ పరిపాలన శాఖ చూసుకోనుంది. అనంతరం ప్రభుత్వం నిర్ణయించే విధానానికి అనుగుణంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేటాయింపు పక్రియ చేపట్టే అవకాశం ఉంది.




## నకిలీలకు చెక్

తెలంగాణలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమైంది. మొత్తం తొమ్మిది రకాల సెక్యూరిటీ ఫీచర్లతో రూపొందించిన ఈ కార్డుల పంపిణీని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రారంభించనున్నారు. సంగారెడ్డి వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించి, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పౌరసరఫరాల శాఖ ఈ నూతన కార్డులను అందుబాటులోకి తీసుకువస్తోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ కార్డులలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అధికారిక సంతకం, తెలంగాణ ప్రభుత్వ అధికారిక హోలోగ్రామ్‌తో పాటు, స్పర్శతో గుర్తించేలా "గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ" అనే అక్షరాలు ఉంటాయి. సాధారణ ముద్రణతో నకిలీ చేయడానికి వీలులేని మైక్రోటెక్స్ట్, ప్రత్యేక కోణంలో చూసినప్పుడు మాత్రమే కనిపించే 'GoTG', 'Original' వంటి పదాలను కూడా ఇందులో పొందుపరిచారు. వీటితో పాటు, కాంతికి ఎదురుగా ఉంచినప్పుడు కనిపించే వాటర్‌మార్క్ లోగో, అతినీల లోహిత కాంతిలో మెరిసే ఇన్విజిబుల్ లోగో, కార్డు వివరాలను ధ్రువీకరించే ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, గిలోష్ ప్యాటర్న్ వంటి అత్యాధునిక సాంకేతికతను జోడించారు. కరెన్సీ నోట్లు, పాస్‌పోర్టుల తయారీలో అనుసరించే అత్యున్నత భద్రతా ప్రమాణాలను ఈ కార్డుల తయారీలోనూ పాటించడం ద్వారా నకిలీ కార్డుల ముద్రణను పూర్తిగా నిరోధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.6 కోట్ల ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. ఈ నూతన స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందేలా చూడటమే తమ అంతిమ లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగుల ఓ నిజం
Singidi
శుక్రవారం 14-8-2026



# విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత

• శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్, ఆగస్టు 13(సింగిడి):** తెలంగాణ ప్రభుత్వం సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా వైద్య రంగాలకు ప్రధాన్యత నిస్తున్నట్లు శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పరిధిలోని ధారూర్ మండలం కుక్కింద గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని (పీహెచ్ సీ ) మరియు ఔసుపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన గ్రామ సభలలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అదిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. హాస్పిటల్ నిర్మాణానికి, ఆధునిక పరికరాల ఏర్పాటుకు భారీ ఎత్తున నిధులను మంజూరు చేస్తున్నదని చెప్పారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ పోస్ట్ లను భర్తీ చేస్తున్నదని తెలిపారు. పట్టణాలలో బస్తి దవాఖానాల లాగా గ్రామాలలో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడి ద్వారా ప్రజలు పెద్ద పెద్ద జబ్బులకు గురవుతున్నారని యాబై సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలని తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చని ఆయన సూచించారు. పేదలు వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేయలేరని రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద ఎత్తున నిధులను అందిస్తున్నట్లు చెప్పారు. సీ ఎం నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తున్నదని అన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలెండర్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అమలవుతున్నాయని అన్నారు. మహిళలను కోటీశ్వరు లను చేయాలనే లక్ష్యంతో మహిళా సాధికార పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీ ఎం సహకారంతో వికారాబాద్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు అవుతున్నాయని రోడ్లు, భవనాల శాఖ ద్వారా 600 కోట్లు, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా ఇప్పటికే 480 కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా నూతనంగా మరో 53 కోట్లు నూతనంగా మంజూరైనట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పదేళ్ళు రోడ్లకు నిధులు ఇవ్వలేదని దీంతో రోడ్లు అద్వానంగా తయారైనట్లు ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చాక రోడ్లను నిర్మించాలని ప్రత్యేక శ్రద్ధతో పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయించినట్లు చెప్పారు. ఆర్ అండ్ బి పంచాయితీ రాజ్ శాఖల ద్వారా మంజూరైన నిధులతో వచ్చే రెండేళ్లలో నియోజక వర్గంలోని అన్ని రోడ్లు అభివృద్ధి చెందనున్నాయని అన్నారు. వికారాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఆశయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి పథకాల ద్వారా ప్రయత్నాలు చేశాను. ప్రాణహిత-చేవెళ్ల పథకంలో సుమారు 1500 కోట్ల రూపాయల పనులు కూడా అయ్యాయని అయితే గత ప్రభుత్వం పదేళ్ళు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని పనులు జరుగలేదని అన్నారు. అనంతరం జూరాల నుండి నీళ్ళను తరలించే విదంగా సర్వేలు చేయించి జీఓ కూడా తీసుకువచ్చామని అన్నారు. ఈ పథకాన్ని కూడా గత ప్రభుత్వం పక్కన పెట్టి మన ప్రాంతానికి అన్యాయం చేసిందని ప్రస్తుతం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీళ్ళు కొడంగల్ సమీపం వరకు వస్తున్నాయని వికారాబాద్ కు కూడా ఇప్పించాలని కోరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకారం తెలిపినట్లు చెప్పారు. సాగు నీళ్ళు వస్తే మన ప్రాంత రైతుల కష్టాలు తీరుతాయని అన్నారు. స్వర్గీయ మంత్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన కోట్ పల్లి ప్రాజెక్టును తరువాత ఎవ్వరూ పట్టించుకోలేదని ప్రస్తుతం పూర్తి స్థాయిలో మరమ్మత్తుల కోసం తొంబై కోట్ల రూపాయలు మంజూరు చేయించానని తెలిపారు. పనులు చురుకుగా జరుగుతున్నాయని అన్నారు. అదేవిధంగా చెరువుల ఆధునికీకరణ, నూతన చెక్ డ్యాం నిర్మాణానికి నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతగిరిని రూ. 2,500 కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అయిదువేల నుండి పదివేల ఉద్యోగాల కల్పన జరుగుతుంది. స్థానికులకే ఉద్యోగాలు వస్తాయని అన్నారు.

# సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

## పనులు ప్రారంభించిన కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ లోని రంగారెడ్డి నగర్ లో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కాలనీల్లో రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు రూ. 30 లక్షల నిధులు మంజూరు చేసి విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ప్రాథమిక అవసరాలను పట్టించుకోకుండా, అనేక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను గత పాలకులు విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, నిధులు మంజూరు



చేస్తూ పనులను చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని, రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కూన శ్రీశైలం గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతే శ్రీనివాస్ యాదవ్, జి రమేష్, బాలరాజు, రమేష్ మంజూల్కర్, కాజా బాయ్, తిమ్మయ్య, పురుషోత్తం, మాధవి, నయీమ్, ఆనంద్ గౌడ్, షకీర్, మల్లం శ్రీను, నారాయణ, రాకేష్, జ్ఞానేశ్వర్ రెడ్డి, తోకలా శ్రీనివాస్, శ్యామల, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై యుఎస్‌పిసి రెండవదశ పోరాటం

• టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప



**రాజేంద్రనగర్ , ఆగస్టు 13 (సింగిడి):** యు ఎస్ పి సి రెండవ దశ పోరాటం లో భాగంగా గురువారం గండిపేట మండలం తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అధికారి విక్రమ్ రెడ్డి కి మెమొరాండం అందజేశాం. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ... ఉపాధ్యాయ విద్యారంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలైన పీఆర్సీ ని వెంటనే అమలు చేయాలి, సిపిఎస్ ను రద్దు చేయాలి, ఈనెల ఆగస్టు 15 లోపు బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ను వెంటనే విడుదల చేయాలని అన్నారు. మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణమే యుపిఎస్ లో అమలు చేయాలని సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు పూర్తిగా టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలలకు గొడ్డలి పెట్టగా ఉన్న జీవోను 25న సవరించి 20 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు నియమిస్తూ 50 మంది పైగా ఉన్న విద్యార్థులు ఉన్న దగ్గర ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా జీవోను మార్పు చేయాలన్నారు. వివో 2018 ప్రకారం ఉమ్మడి సర్వీస్ రూల్స్ ను రూపొందించి అర్హులైన ఉపాధ్యాయులకు ఎంఈఓ లు డిప్యూటీ ఈవోలు, జె ఎల్ ఎస్ డైట్ లెక్చరర్, బీఈడీ కళాశాలల అధ్యాపకులుగా పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రమతో దోపిడికి గురవుతున్న కేజీబీవీ సిబ్బందికి ఎస్ ఎస్ ఏ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. అన్ని గురుకులాల పాఠశాలలో సమయ సారాన్ని ఒకే విధంగా ఉండేటట్లు చూడాలన్నారు. ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీ లో నుండి మినహాయింపు నివ్వాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు టీఎస్ యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్పిసి నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి పోరాట షెడ్యూల్ ఈనెల ఏడో తారీఖు ప్రతి పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్, గండిపేట్ మండల అధ్యక్షుడు ఎండి మాజీ ప్రధాన కార్యదర్శి కె రవికుమార్, నాయకులు ఇందిరా, హనుమంతు, ప్రహ్లాద రావు, శ్రీనివాస్, విజయ్ కుమార్, కిషన్, శ్రీకాంత్, రామచంద్ర రావు, సునీల్ భాష, బిక్షపతి, మానయ్య పాల్గొన్నారు.

# భౌరంపేట్ శ్రీ దుర్గాదేవి ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## అధ్యక్షునిగా వెంకట్రాం అనంతరెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ శ్రీ దుర్గాదేవి ఆలయ నూతన కమిటీని గురువారం గ్రామ నాయకులు, పెద్దలు, భక్తుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా వెంకట్రామ్ ఆనంద్ రెడ్డిని ఎన్నుకున్నట్లు మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులుగా వి.సుభాష్ రెడ్డి, కె . సందీప్ చారి ని నియమించగా కోశాధికారిగా ఈ. లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బ విష్ణు, సంయుక్త కార్యదర్శిగా కె . నవీన్ చారి గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఈ . కృష్ణ రెడ్డి, ఈ . జంగా రెడ్డి, జి . బుచ్చిరెడ్డి, ఎన్ . హన్మంత్ రెడ్డి, చింత వెంకటేష్, నామాల రాము, డి . మహేష్, సిహెచ్ శ్రీకాంత్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులంతా ఐక్యంగా పనిచేస్తూ, గ్రామస్తులు, భక్తులను కలుపుకొని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఎటువంటి భేదాభిప్రాయాలకు, బేషజాలకు తావులేకుండా అందరూ కలిసి పనిచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్దలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్‌లో కనుల విందుగా తిరంగా భారీ ర్యాలీ




**అల్వాల్, ఆగస్టు 13 (సింగిడి):** బిజెపి అధిష్టానం పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అల్వాల్ బిజెపి నాయకులు గురువారం ప్రజలకు జాతీయ పతాకాలను ఉచిత పంపిణీ చేశారు. అల్వాల్ ప్రధాన రహదారి మీసేవ నుండి ఓల్డ్ అల్వాల్ ఐజి స్టార్ట్ వరకు భారీ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అల్వాల్ మెయిన్ రోడ్ నుండి ప్రధాన రహదారి పై భారీ త్రివర్ణ పథకాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులు పార్టీ శ్రేణులు దేశభక్తితో నినాదాలతో భారీగా సాగారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లు పి మాణిక్ రెడ్డి, శ్రీనివాస్ వర్మ, సీనియర్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, కార్తీక్ గౌడ, రాజిరెడ్డి, సూర్య, కృష్ణారెడ్డి, అజయ్ రెడ్డి, అరవింద్ రెడ్డి, మురళి, మోయి సుజాత, కర్ణ శ్రీ, ఉదయ్, రామ్ సింగ్, ఆనంద్, జేఏసీ సురేందర్ రెడ్డి, వికె మహేష్, వినయ్, అనిల్, రాము, ఉదయ్, విష్ణుమూర్తి, పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో రూ.48 కోట్లతో ఆధునిక ప్రభుత్వ పాఠశాల

ఆగస్టు 17న భూమిపూజ..

ఎకరా స్థలంలో కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన..

పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్చెరు, ఆగస్టు 13(సింగిడి):** పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా తెల్లాపూర్‌లో రూ. 48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ (సి యు ఆర్ ఈ) పరిధిలోని తెల్లాపూర్‌లో ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు వెల్లడించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి పాఠశాల నిర్మించనున్న తెల్లాపూర్‌లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ విద్య అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి సమానమైన, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని అన్నారు. ఒకే ప్రాంగణంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించడం ద్వారా విద్యార్థులకు నిరంతర విద్యా వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సమృద్ధిగా పుస్తకాలతో లైబ్రరీలు, ఇతర ఆధునిక విద్యా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్నట్లు చెప్పారు. పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్ ప్రాంతంలో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరం ఉందని, ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 17న నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. తెల్లాపూర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ పాఠశాల భవిష్యత్ తరాలకు విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు, ప్రభుత్వ విద్యా రంగంలో నూతన ప్రమాణాలకు నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు హెల్త్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 20 లక్షలు ఇవ్వాలి



**వికారాబాద్, ఆగస్టు 13(సింగిడి):** ఫ్రీ ఫైర్ స్కూల్స్ అంగన్వాడికు అప్పచెప్పాలని, అదనపు పనిభారం బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, సొంత భవనాలు నిర్మించాలని మండల కేంద్రాలలో మీటింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జిల్లా పరిధిలోని నవాబు పేట మండల కేంద్రంలో అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ మహిపాల్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు 32వేలు అమలు చెయ్యాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10లక్షలు ఇవ్వాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, యూనిఫాంలు ఇవ్వాలని ప్రతి గ్రామంలో అంగన్వాడి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. మండల కేంద్రంలో మీటింగ్ హాల్ ఏర్పాటు చేయాలన్నారు. పోటీ సెంటర్లు రద్దు చేయాలి ప్రీ ప్రైమరీ శ్రీ విద్యను అంగన్వాడీలకే ఇవ్వాలని ఆయన అన్నారు. అందరికీ ఇండ్లు ఇళ్లస్థలాలు ఇవ్వాలని అకారణంగా అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ ను తొలగించే ప్రక్రియ ఆపాలని డిమాండ్ చేశారు. నిరంతరం అధికారుల నాయకుల వేధింపులు ఆపాలి అన్నారు. లేనిచో ఆందోళన పోరాటలు చ్చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సంగీత, లక్ష్మీ రాములమ్మ, జయ బానిస, విజయలక్ష్మి, జయాబునిసా, రాములమ్మ, కాంసమ్మ, సంగీత, సునీత, జ్యోతి, నాగమణి జయమ్మ, దేవమ్మ, శకుంతల, అన్నపూర్ణ, పద్మ, విజయ, సునీత, స్వరూప, భావన, సుమిత్ర, ప్రసన్న,అలివేణి, విజయ లక్ష్మి, నంబమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

## ఖాళీ పోస్టులను భర్తీలు చేయాలి



**కొడంగల్,ఆగస్టు13 (సింగిడి):** విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని దానితోపాటు విద్యారంగంలో ఖాళీగా ఉన్న డిఇఓ డిప్యూటీ డిఈఓ ఎంఈఓ మరియు బోధినేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేసి విద్యారంగ అభివృద్ధికి సమూలమైన చర్యలు చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించి, బోధనేతర పనులు తొలగించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ సదుపాయం, తరగతి గదుల నిర్మాణం వంటి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, గుంజ వెంకటయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

# హర్ గర్ తిరంగా నినాదంతో ర్యాలీలు



**వికారాబాద్, ఆగస్టు 13(సింగిడి):** జిల్లాలో గురువారం హర్ గర్ తిరంగా కార్యక్రమం సందర్భంగా బీ జే పి ఆధ్వర్యంలో హర్ గర్ తిరంగా నినాదాలతో ర్యాలీలు నిర్వహించారు. పరిగి పట్టణ అధ్యక్షులు బాలకృష్ణరెడ్డి, పరిగి మండల అధ్యక్షురాలు అనసూయ శ్యామ్ సుందర్, ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి, బీజేపీ నాయకుడు వెన్న ఈశ్వరప్ప తదితరులు ర్యాలీలో నినదించారు. ఈ సందర్భంగా మారుతి కిరణ్ బూనేటి గారు మాట్లాడుతూ హర్ గర్ తిరంగా మన దేశ గౌరవానికి ప్రతీకని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రామచంద్రయ్య, రాము యాదవ్, కేశవులు, డి. ఆంజనేయులు, పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్రనరసింహ, మండల మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రంగంపల్లి గ్రామ సర్పంచ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముని అశోక్, రంగంపల్లి గ్రామ ఉపసర్పంచ్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు అ-నూష, జిల్లా మహిళా మార్చనాయకురాలు వాణిశ్రీ గుప్తా, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్పీ శీను, బీజేపీ నాయకులు కంకల్ రవీందర్, కన్నయ్యల రాజు, పోల్కంపల్లి భీమయ్య, జిల్లా కార్మిక సెల్ జాయింట్ కన్వీనర్ జోక సురేష్ బాబు, ప్రభాకర్, బీజేవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ మనోహర్ గౌడ్, వికారాబాద్ లో ఏ వి ఎన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమేష్, విద్యార్థులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## కందువా మారిందా.. కష్టాలు తీరాయా?

రాజకీయాల్లో పార్టీలు, సమీకరణాలు మారడం కొత్త కాదు. కానీ "నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార పక్షానికి చేరువయ్యాం" అని చెప్పిన ప్రజాప్రతినిధుల మాటలను నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా ఉంటుంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వైపు వెళ్లినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న పది మంది ఎమ్మెల్యేల వ్యవహారం ఈ కోణంలో మరోసారి చర్చకు వచ్చింది.
దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, ఎం. సంజయ్‌కుమార్, అరికెపూడి గాంధీ, టి. ప్రకాశ్‌గౌడ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కాలే యాదయ్య పేర్లు ఈ పరిణామంలో ప్రముఖంగా వినిపించాయి. వీరి విషయంలో ఫిరాయింపు ఆరోపణలపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే స్పీకర్ వాటిని కొట్టివేసిన నేపథ్యంలో, న్యాయపరమైన తుది తీర్పులా "పార్టీ మారిన ఎమ్మెల్యేలు" అని కాకుండా, "బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వైపు వెళ్లిన ఎమ్మెల్యేలు" అని పేర్కొనడమే సముచితం.

ఈ నేపథ్యంలో బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తాజా వ్యాఖ్యలు రాజకీయ చర్చకు కొత్త కోణం ఇచ్చాయి. మంత్రి పదవి, డబ్బు కోసం కాంగ్రెస్ వైపు వెళ్లలేదని, బాన్సువాడ అభివృద్ధి కోసమే నిర్ణయం తీసుకున్నానని ఆయన చెబుతున్నారు. పార్టీ మారే సమయంలో ఆరు నెలల్లో పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, కానీ సగం నిధులే వచ్చాయని, మిగిలిన వాటి కోసం ప్రయత్నిస్తున్నా ముఖ్యమంత్రి, మంత్రులు ఫోన్ ఎత్తడం లేదని పోచారం ఆవేదన వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ కందువా కప్పుకోలేదు.. జాతీయ జెండా కప్పుకున్నాను" అన్న ఆయన వ్యాఖ్య మరింత చర్చకు దారితీసింది.
ఇక్కడే రేవంత్ ప్రభుత్వానికి ఒక కీలక అవకాశం ఉంది. నమ్మి వచ్చిన నాయకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, వారి నియోజకవర్గాలను అభివృద్ధి చేసి చూపిస్తే అది కేవలం ఆ ఎమ్మెల్యేలకు న్యాయం చేయడం కాదు; ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెంచే రాజకీయ పెట్టుబడి అవుతుంది. రోడ్లు, సాగునీరు, తాగునీరు, ఆసుపత్రులు, పాఠశాలలు, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలు "మా నాయకుడు తీసుకున్న నిర్ణయంతో మా ప్రాంతానికి మేలు జరిగింది" అని భావించే అవకాశం ఉంది. అప్పుడు ఆ నాయకుడి నిర్ణయానికి ప్రజల మద్దతు లభించడమే కాకుండా, రేవంత్ ప్రభుత్వానికీ రాజకీయంగా బలం చేకూరుతుంది. అందుకే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలైతేనే "నమ్మి వచ్చిన వారిని ప్రభుత్వం మోసం చేయలేదు" అనే అభిప్రాయం బలపడుతుంది. లేకపోతే పార్టీ మార్పుకు చెప్పిన అభివృద్ధి కారణమే ప్రజల ముందు బలహీనపడుతుంది. ప్రశ్న నాయకుడు ఎక్కడ కూర్చున్నాడన్నది కాదు.. అతని నియోజకవర్గంలో ఏమి మారిందన్నదే. ఇదే ప్రశ్న మహారాష్ట్రలోనూ కనిపించింది. 2026 జూన్‌లో శివసేన(యూబీటీ)కి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు అందకపోవడమే ప్రధాన కారణాల్లో ఒకటిగా వారు చెప్పారు. షిండే ప్రభుత్వం తరువాత కొందరికి అభివృద్ధి నిధులు విడుదల చేసినట్లు ప్రకటించింది. అంటే అక్కడ కూడా "అధికారానికి చేరితే అభివృద్ధి జరుగుతుందా?" అన్న ప్రశ్న ముందుకొచ్చింది. జార్ఖండ్ మరో హెచ్చరికను ఇచ్చింది. 2024లో జేఎంఎంకు చెందిన లోబిన్ హెంబ్రోమ్, కాంగ్రెస్‌కు చెందిన జైప్రకాశ్ భాయ్ పటేల్‌పై పదో షెడ్యూల్ కింద అనర్హత వేటు పడింది. పార్టీ మార్పు రాజకీయ నిర్ణయమే అయినా, దానికి రాజ్యాంగపరమైన పరిణామాలు ఉంటాయని ఈ ఘటన గుర్తుచేసింది. తెలంగాణలో ఇప్పుడు అసలు పరీక్ష ఇదే. అధికారానికి చేరువైన ఎమ్మెల్యేల నియోజకవర్గాలు అభివృద్ధి చెందితే, వారి నిర్ణయాన్ని ప్రజలే సమర్థించే అవకాశం ఉంది. అభివృద్ధి కనిపించకపోతే మాత్రం కందువా మారినా కష్టాలు మారలేదనే భావన బలపడుతుంది. ప్రజలు చివరకు జెండా రంగును కాదు.. తమ ఊరి రోడ్డును, ఆసుపత్రిని, నీటిని, పాఠశాలను చూస్తారు. కాబట్టి రాజకీయంగా నమ్మి వచ్చిన వారిని నిలబెట్టే ఉత్తమ మార్గం పదవి కాదు.. అభివృద్ధి. కందువా మారింది అనేది రాజకీయ వార్త కావచ్చు. కానీ నియోజకవర్గం మారితేనే అది ప్రజల విజయగాథ అవుతుంది.

**శ్రీశైలం దూడం**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్??9133947176**

# భారత స్వాతంత్ర్య చట్టం 1947



పొట్ట కోటికోసం, సుగంధ ద్రవ్యాల వ్యాపారార్థం 1498లో వాస్కోడ గామా కాలికట్ లోని కోజికొడ్ ఓడ రేవులో కాలూనినది మొదలు ఐరోపా వర్తకుల రాకపోకలు భారత ఉప ఖండంలో ప్రారంభమైనాయి. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలోని బ్రిటీష్ సైన్యం బెంగాల్ నవాబుపై విజయం సాధించ టంతో, భారత దేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ప్రారంభమైంది. 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1784లో చేసిన ఇండియా చట్టం, 1833 చార్టర్ చట్టం మొదలైన చట్టాలు భారతదేశంలో బ్రిటీష్ అధికారాన్ని సుస్థిరం చేశాయి. 1849 పంజాబ్ ఆక్రమణ తరువాత అనేక చిన్నచిన్న తిరుగుబాట్లు, అనంతరం 1857 సిపాయిల తిరుగుబాటు ఫలితంగా, బ్రిటీష్ వారు ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనను రద్దు చేసి విక్టోరియా రాణి పరిపాలనను ప్రవేశ పెట్టారు. భారత పాలనా వ్యవహారాలను చూసుకోవటానికి వైస్రాయిని నియమించారు. ఈ విధంగా భారతదేశం నేరుగా బ్రిటీష్ పాలనలోకి వచ్చింది. 90 ఏళ్ల స్వాతంత్ర్య పోరాట క్రమాల అనంతరం చివరి బ్రిటీష్ గవర్నర్ జనరల్ అయిన విస్కౌట్ లూయిస్ మౌంట్ బాటెన్ 1947 జూన్ 3 న బ్రిటీష్ ఇండియాని లౌకిక భారత దేశం గాను, ఇస్లామిక్ పాకిస్తాన్ గాను విభజిస్తున్నట్లు ప్రకటిం చారు. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్, 1947 ఇవ్వబడుతుంది. ఆగస్టు 15 న భారత దేశం స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. భారత స్వాతంత్ర్య చట్టం 1947 అన్నది బ్రిటిషు ఇండియాను భారతదేశం, పాకిస్తాన్ అన్న రెండు స్వతంత్ర డొమినియన్లుగా విభజించేందుకు యునైటెడ్ కింగ్ డమ్ పార్లమెంటు చేసిన చట్టం. జూలై 18, 1947న ఈ చట్టం రాజ సమ్మతి పొందింది.
సంప్రదింపుల అనంతరం జవహర్ లాల్ నెహ్రూ, వల్లభ్ బాయి పటేల్, ఆచార్య కృపలానీ ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ, మహమ్మద్ అలీ జిన్నా, లియాఖత్ అలీ ఖాన్, అబ్దుల్ రబ్ నిష్తార్ ప్రాతినిధ్యంలోని ముస్లిం లీగ్, సిక్కుల ప్రతినిధిగా సర్దార్ బల్దేవ్ సింగ్లతో గవర్నర్ జన రల్ ఆఫ్ ఇండియా లార్డ్ మౌంట్ బాటన్ ఒప్పందానికి వచ్చాక, భారత స్వాతంత్ర్య అనుకూలుడైన బ్రిటిష్ ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ ప్రభుత్వం, భారత గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటన్ కలిసి చట్టాన్ని తయారు చేశారు. అధికార బదిలీ కోసం సంప్రదింపులు చేసేందుకు వచ్చిన క్యాబినెట్ మిషన్ సమైక్య భారత సమాఖ్య ప్రతిపాదన (మే 16 ప్రతిపాదన)కు కాంగ్రెస్, ముస్లింలీగ్ ల ఆమోదం లభించింది.
కానీ కేబినెట్ మిషన్ సభ్యుడు క్రిప్స్ ఎవరికి అనుకూలమైన నిర్వచనం వారికి చెప్తూ ఆమోదం పొందడంతో వారు వెళ్ళగానే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవహర్ లాల్ నెహ్రూ ప్రసంగిస్తూ, దాన్ని పూర్తిగా తిరస్కరిం చాడు. దాంతో ఆగ్రహించిన ముస్లిం లీగ్ నాయ కుడు జిన్నా ప్రత్యక్ష కార్యాచరణకు పిలుపుతో హింసాత్మకమైన మలుపుతో కాంగ్రెస్, బ్రిటిషు ప్రభుత్వాల పై ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలో దేశాన్ని సమాఖ్యగా ఉంచే మే 16 ప్రతిపాదన, పూర్తి బెంగాల్, పూర్తి పంజాబ్ లతో పాకిస్తాన్ విభజించి ఏర్పరిచే జూన్ 16 ప్రతిపాదనకు మధ్యగా మరో ప్రణాళికను ముందు సివిల్ సర్వెంట్ వి.కె. మీనన్ తయారు చేశారు. దీని ప్రకారం బ్రిటిషు ఇండియా... భారత దేశం, పాకిస్తాన్లుగా విభజన అవుతుంది. అలాగే బెంగాల్, పంజాబ్ ప్రావిన్సులు కూడా విభజితమై, ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు పాకిస్తాను, హిందువుల సంఖ్యాధిక్యత ఉన్న ప్రాంతాలు భారతదేశానికి లభిస్తాయి. ఇది మౌంట్ బాటన్ ప్రణాళికగా పేరొందింది.
బ్రిటీష్ ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ 1947 ఫిబ్రవరి 20న చేసిన ప్రకటన ప్రకారం బ్రిటిషు ప్రభుత్వం బ్రిటిషు ఇండియాకు పూర్తి స్వంత ప్రభు త్వాన్ని కనీసం 1948 జూన్ నాటికి మంజూరు చేస్తుంది. తుది (అధికార) బదిలీ తేదీ నిర్ణయించిన తర్వాత సంస్థానాల భవితవ్యం నిర్ణయమవు తుంది. ప్రధానంగా లార్డ్ మౌంట్ బాటన్ ప్రణాళికగా పేరొందిన బ్రిటిషు ప్రభుత్వం 1947 జూన్ 3న ప్రతిపాదించిన ప్రణాళికలో గల అంశాలు భారత విభజనకు సూత్రాన్ని బ్రిటిషు ప్రభుత్వం అంగీకరించింది. వారసులుగా వచ్చే ప్రభుత్వాలకు డొమినియన్ స్థాయి ఇవ్వ బడుతుంది. బ్రిటిషు కామన్వెల్త్ నుంచి ఎప్పుడైనా తప్పుకునేందుకు షర తులులేని హక్కు ఉంటుంది. అలా భారత స్వాతంత్ర్య చట్టం 1947 అన్నది జూన్ 3 ప్రణాళికకు అమలు వంటిది.

1947 ఆగస్టు 15న బ్రిటీష్ ఇండియాను భారత దేశం, పాకిస్తాన్ అనే రెండు కొత్త దేశాలుగా విభ జించడం; బెంగాల్, పంజాబ్ ప్రావిన్సుల విభ జించి, రెండు కొత్త దేశాలకు పంపకం చెయ్యడం; రెండు కొత్త దేశాలలో గవర్నర్ జనరల్ కార్యాల యాన్ని బ్రిటన్ రాచరికపు ప్రతినిధిగా ఏర్పాటు చేయడం; రెండు కొత్త దేశాల రాజ్యాంగ సభలకు పూర్తి శాసనాధికారాన్ని ఇవ్వడం; 1947 ఆగస్టు 15 న సంస్థానాలపై బ్రిటీష్ అధికారాన్ని ముగిం చడం. స్వతంత్రంగా ఉండడానికి గాని, ఏదో ఒక దేశంలో చేరడానికి గాని వాటికి ఉన్న హక్కును గుర్తించడం; బ్రిటిషు చక్రవర్తి 'భారత చక్రవర్తి' అనే పేరును వాడడాన్ని రద్దు చేయడం (కింగ్ జార్జ్ ఎ× రాజు 1948 జూన్ 22 న రాజ ప్రకటన ద్వారా దీన్ని అమలు చేశాడు). సాయుధ దళాల విభజనతో సహా ఉమ్మడి ఆస్తిని రెండు కొత్త దేశాల మధ్య పంపకానికి ఈ చట్టం ఏర్పాటు చేసింది. ఈ చట్టం ప్రకారం భారతదేశం, పాకిస్తాన్. రెండు కొత్త డొమినియన్లు భారత సామ్రాజ్యం నుండి. ఉద్భవిస్తాయి. 1947 ఆగస్టు 15 ను విభజన తేదీగా నిర్ణయించారు. కొత్త రాజ్యాంగాన్ని రూపొందించే లోపు, కొత్త రాజ్యాలను, దాని ప్రావి న్సులనూ భారత ప్రభుత్వ చట్టం 1935కు లోబడి
సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా కార్యాలయం రద్దు అయింది. 1947 జూన్ 4 న, మౌంట్ బాటెన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తద్వారా దేశంలోని 563 కు పైగా ఉన్న భారతీయ సంస్థానాలకు, బ్రిటన్కు మధ్య ఉన్న ఒప్పందం సంబంధాలు ముగిసి పోతాయని, 1947 ఆగస్టు 15న బ్రిటీష్ అధికారం ముగుస్తుందని, క్రొత్త డొమినియన్లలో ఏదో ఒకదానిలో చేరడానికి, లేదా స్వతంత్రంగా ఉండడానికి వారికి స్వేచ్ఛ ఉంటుందని వివరిం చారు. చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటన్ భారత గవర్నర్ జనరల్గా కొనసాగాలని భారత నాయకులు కోరారు. జవహర్లాల్ నెహ్రూ భారత ప్రధాని, సర్దార్ వల్లభాయ్ పటేల్ హోంమంత్రి అయ్యారు. ఆగస్టు 15 నాటికి 560కి పైగా రాచ రిక రాష్ట్రాలు భారత దేశానికి చేరాయి. తర్వాత జమ్మూ కశ్మీర్ 1947 అక్టోబరు 26 న, హైదరా బాద్ రాజ్యం భారత ప్రభుత్వ 1948 సెప్టెంబరు 13 న సైనిక చర్య జోక్యం ద్వారా సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం అయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...**
**9440595494**




నిజాంసాగర్ ఆనకట్ట నిర్మాణం – రాళ్లు పేర్చే పనిలో కూలీలు



మట్టిని తరలించే ఖైదీ కూలీలు (నిర్మాణ పనులు)



నిజాంసాగర్ కాలువ నిర్మాణ రైల్వే (1924-1940) – నిర్మాణ సామగ్రి రవాణా



నిర్మాణం పూర్తయిన తర్వాత నిజాంసాగర్ ఆనకట్ట దృశ్యం (1931)

Nizam Sagar Dam

### చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత

శతాబ్దానికి చేరువైన ఈ ప్రాజెక్టు కేవలం నీటి పారుదల వ్యవస్థగా కాకుండా ఒక చారిత్రక వారసత్వ సంపదగా కూడా భావించాల్సిన అవసరం ఉంది. దీని నిర్మాణ చరిత్ర, అప్పటి ఇంజినీరింగ్ విధానాలు, కూలీల జీవితం, నాటి సామాజిక పరిస్థితులపై మరింత పరిశోధన జరగాలి. నిజాంసాగర్ గోడల్లో కనిపించేది కేవలం సిమెంట్, రాళ్లు కాదు.. నాటి ఇంజినీర్ల మేధస్సు, కూలీల శ్రమ, రైతుల భవిష్యత్తుపై నాటితరం కన్న కలల జ్ఞాపకాలు. అందుకే నిజాంసాగర్‌ను చూస్తే.. అది ఒక ప్రాజెక్టుగా మాత్రమే కనిపించదు. ఒక శతాబ్దపు చరిత్ర మన కళ్లముందు నిలిచినట్టుగా అనిపిస్తుంది.

### ఖైదీ కూలీల చెమటతో
### నిర్మితమైన నిజాంసాగర్!

నిజాంసాగర్ మంజీరా నదిపై నిజాం పాలనలో నిర్మితమైన నిజాంసాగర్ ప్రాజెక్టు నేటికీ తెలంగాణ చరిత్రలో ఓ అద్భుత ఇంజినీరింగ్ కట్టడంగా నిలిచింది. 1923లో ప్రారంభమైన నిర్మాణం 1931లో పూర్తయింది. అప్పట్లో సుమారు 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ భారీ ప్రాజెక్టును చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జైళ్లలో ఉన్న ఖైదీలను కూడా కూలీలుగా ఉపయోగించుకున్నారనే స్థానిక చారిత్రక కథనం ఉంది. కఠిన పరిస్థితుల్లోనూ వారు రాళ్లు, మట్టి, నిర్మాణ సామగ్రిని తరలిస్తూ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములయ్యారని పెద్దలు చెబుతుంటారు. కూలీల కష్టం.. ఇంజినీర్ల నైపుణ్యం.. నాటి పాలకుల ప్రణాళిక.. ఇవన్నీ కలిసే నిజాంసాగర్ రూపుదిద్దుకుంది. అందుకే దాదాపు శతాబ్దం దాటినా ఈ ప్రాజెక్టు చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. నేటి తరానికి నిజాంసాగర్ ఒక నీటి వనరు మాత్రమే కాదు.. నాటి శ్రమ, సాంకేతిక నైపుణ్యం, చరిత్రకు నిలువెత్తు గుర్తు!

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170**

## ఖైదీ కూలీల చెమటతో రూపుదిద్దుకున్న

# నిజాంసాగర్ ప్రాజెక్టు...

## శతాబ్దం దాటినా చెక్కుచెదరని నిర్మాణం...

మంజీరా నదిపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు తెలంగాణ చరిత్రలో ఒక అపూర్వమైన ఇంజినీరింగ్ అద్భుతం. నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం ప్రభుత్వం 1923లో ప్రారంభించిన ఈ భారీ ప్రాజెక్టు 1931లో పూర్తయింది. అప్పట్లో 29.72 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సుమారు 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో దీనిని నిర్మించారు. నిజాంసాగర్ నిర్మాణం వెనుక కేవలం ఇంజినీర్ల ప్రతిభ, పాలకుల ప్రణాళిక మాత్రమే కాదు.. వేలాది మంది కూలీల శ్రమ కూడా దాగి ఉంది. ఆ కాలంలో జైళ్లలో ఉన్న ఖైదీలను కూడా కఠిన శ్రమలో భాగంగా నిర్మాణ పనులకు వినియోగించారనే స్థానిక చారిత్రక కథనాలు నేటికీ వినిపిస్తుంటాయి. రాళ్లు కొట్టడం, మట్టి తరలించడం, నిర్మాణ సామగ్రిని మోసుకెళ్లడం వంటి కష్టమైన పనుల్లో వారు పాలుపంచుకున్నారనే కథనాలు పెద్దల నుంచి తరతరాలకు వస్తున్నాయి. రాళ్లలో కనిపించే నాటి శ్రమ నేటి ఆధునిక యంత్రాలు, భారీ క్రేన్లు, సాంకేతిక పరికరాలు అందుబాటులో లేని కాలంలో ఇంతటి భారీ జలాశయాన్ని నిర్మించడం చిన్న విషయం కాదు. వేలాది మంది కూలీలు రోజుల తరబడి చెమటోడ్చి పనిచేయడంతోనే ఈ మహా నిర్మాణం సాకారమైంది. ఆ కష్టానికి నిదర్శనంగానే నిజాంసాగర్ ఆనకట్ట నేటికీ చరిత్రను మోస్తూ నిలిచింది. అప్పటి నిర్మాణ పద్ధతులు, ఉపయోగించిన రాళ్లు, ఆనకట్ట నిర్మాణంలో కనిపించే నైపుణ్యం నేటి తరాన్ని కూడా ఆశ్చర్యానికి గురిచేస్తాయి.

**సాగునీటికి జీవనాధారం**


నిజాంసాగర్ కేవలం ఓ ఆనకట్ట కాదు.. ఉమ్మడి నిజామాబాద్ ప్రాంతంలోని వేలాది రైతు కుటుంబాల జీవనాధారం. బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో వ్యవసాయానికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారింది. కాలం మారింది.. ప్రభుత్వాలు మారాయి.. సాగు పద్ధతులు మారాయి. కానీ మంజీరా నీటిని ఒడిసిపట్టి రైతుల పొలాలకు తరలించే నిజాంసాగర్ ప్రాధాన్యం మాత్రం కొనసాగుతూనే ఉంది.

**నిజాంసాగర్ నిర్మాణానికి ప్రత్యేక రైల్వే లైన్!**

నిజాంసాగర్ దాదాపు శతాబ్దం క్రితం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో అప్పట్లో ప్రత్యేకంగా 2 అడుగుల నారో గేజ్ రైల్వే లైన్ ను ఉపయోగించినట్లు చారిత్రక రికార్డులు పేర్కొంటున్నాయి. ఈ నిర్మాణ రైల్వేను ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులకు వినియోగించారు. నిర్మాణ సామగ్రి, ఇతర అవసరాలను తరలించేందుకు ఈ చిన్న రైల్వే కీలకంగా పనిచేసినట్లు సమాచారం. యంత్రాలు అందుబాటులో లేని ఆ కాలంలో.. రైల్వే సహాయంతో సాగిన భారీ నిర్మాణ పనులు నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనం.



## మూగజీవాల సంరక్షణ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత



- గోశాలకు రూ.40 వేల పశుగ్రాసం సాయం

**కరీంనగర్, ఆగస్టు13(సింగిడి):** గిరిజా గోశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మృత్యుంజయ మహాదేవాలయం గోశాల వ్యవస్థాపక చైర్మన్ పురాణం మహేశ్వరి శర్మ సారథ్యంలో నిర్వహిస్తున్న గోశాలకు పశు గ్రాసం కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూ. 40 వేల ఆర్థిక సహాయం అందించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నల్ల లింగారెడ్డి తన శాఖ నిర్వహణ నుంచి రూ. 40 వేల చెక్కును గోశాల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, గోశాల కార్యదర్శి చల్ల మోహన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సంఘ్యం లక్ష్మణరావు, పశుసంవర్ధక శాఖ మంత్రిత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు మాట్లాడుతూ మూగజీవాల సంరక్షణకు ఆర్థిక సహాయం అందించిన నల్ల లింగారెడ్డి, పశుసంవర్ధక శాఖ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. గోవులు పాలు, సేంద్రియ ఎరువు ద్వారా రైతులకు, వ్యవసాయానికి, సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆహారం, నీరు, వైద్యం, ఆశ్రయం కల్పిస్తూ మూగజీవాలను సంరక్షించడం మానవతా సేవతో సమానమని అన్నారు. గోవులు, మూగజీవాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, గోశాల నిర్వహణకు పశుగ్రాసం, వైద్యం తదితర అవసరాల కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## సింగరేణిలో 'సురక్షక తిరంగా' సైబర్ అవేర్నెస్




**గోదావరిఖని, ఆగస్టు 13(సింగిడి):** రామగుండం ఏరియా-1లోని జీడీకే 2ఌ2ఏ ఇంక్లైన్, జీడీకే 2 సెక్షన్‌లో గురువారం 'సురక్షక తిరంగా' సైబర్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. జీఎం ఆర్జీ-1 డి. లలిత్ కుమార్ ఆదేశాల మేరకు, సైబర్ క్రైమ్ ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సైబర్ మోసాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, బ్యాంకు వివరాలు, ఓ టీ పి,పాన్ , ఆధార్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఏ పి కె ఫైల్స్, తెలియని యాప్‌లను ఓపెన్ చేయవద్దని, పోలీసుల పేరుతో వచ్చే బెదిరింపు కాల్స్‌కు భయపడవద్దని తెలిపారు. పెట్టుబడి మోసాలపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గని మేనేజర్ ఇజ్జగిరి శివయ్య, వెల్ఫేర్ ఆఫీసర్ డి. గణేష్, సెక్షన్ ఇంచార్జ్ సల్మాన్ ఖాన్, వెంటిలేషన్ ఆఫీసర్ జి. కుమారస్వామి, అధికారులు, సూపర్వైజర్లు, మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## దేశభక్తిని చాటుతూ వావిలాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**జమ్మికుంట, ఆగస్టు 13: (సింగిడి):** దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. జమ్మికుంట మండల బీజేపీ అధ్యక్షుడు దొంతరవేణ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు, విద్యార్థినులతో పాటు గ్రామ ప్రజలు, బీజేపీ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే సందేశంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను యువతలో మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జమ్మికుంట మండల బీజేపీ ఇన్‌చార్జి పుప్పాల రఘు, మాజీ మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు, వావిలాల బూత్ అధ్యక్షుడు మేడిపల్లి సమ్మయ్య, పాపక్కపల్లె బూత్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, వావిలాల బీజేపీ సీనియర్ నాయకులు వీరగొని రాజయ్య, జమ్మికుంట మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు కంకణాల స్వరూపరాణి, గోపాలపురం బూత్ అధ్యక్షుడు రమణాకర్‌రెడ్డి, తోడేటి శ్రీనివాస్, బాసాని సత్తయ్య, పోల్సాని పురుషోత్తంరావు, అంకుశపురం గ్రామ సర్పంచ్ కావిడి కుమారస్వామి, తిరుపతి, చెట్టి హరీష్, మహేందర్, కంకణాల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ సంపత్, మాధారపు లింగారావు, గొడుగు అంజి, జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి పుల్లూరు ఈశ్వర్, పాపక్కపల్లె వార్డు మెంబర్ అడ్డాల రవళి, తిరుపతి, పాపక్కపల్లె బీఎల్ఏ-2 లింగాల రమేష్, పుట్టకోకుల కుమార్, సురేందర్, విజేందర్, బాలరాజు, వెలుపల మధునయ్య, శివానంద చారి, మడిపల్లి విక్రం, మొగుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానం మందలించిన స్పందించరా..

సంక్షేమ పథకాల కొనసాగింపుపై ప్రజల్లో ఆందోళన...

కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం, బీఆర్ఎస్ మహిళా నేత శిరీష ఆకినపల్లి..



**జమ్మికుంట, ఆగస్టు 13 (సింగిడి):** రాష్ట్రంలో కొనసాగుతున్న రైతుబంధు ఆసరా పింఛన్ లాంటి పథకాలను తీసేసిన కూడా ప్రభుత్వం మౌనం వహిస్తుందా అని టిఆర్ఎస్ మహిళా నేత ఆకినపల్లి శిరీష ప్రభుత్వాన్ని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడపిల్లల కోసం పెద్దన్నలాగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి పథకాలతోపాటు ఆసరా పింఛన్ రైతుబంధు దళిత బంధు పథకాలను అందించి ఎన్నో కుటుంబాలలో వెలుగులు నింపారని ఆమె తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని రాబోయే రోజుల్లో మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. నిజాలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై కాంగ్రెస్ నేతలు మాట్లాడే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలోనే ప్రజలు గద్దె దించుతారని ఆమె అన్నారు. సంక్షేమ పథకాలపై హైకోర్టు మందలించిన కనీసం కౌంటర్ దాఖలు చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆమె దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి న్యాయస్థానానికి సమాధానం చెప్పాలని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

- నిజాలు మాట్లాడితే విమర్శించడం సరికాదు
- మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావేద్



**జమ్మికుంట, ఆగస్టు 13 (సింగిడి) :** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యక్తిగత విమర్శ చేయడం సరైన పద్ధతి కాదని నిజాలు మాట్లాడితే దుష్ప్రచారాలు చేయడం దిక్కుమాలిన చర్య అని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ వైస్ చైర్మన్ అన్నారు. గురువారం జమ్మికుంటలో ఏర్పాటు చేస్తే మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, కమలాపూర్‌లో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ సంయుక్తంగా ఖండించారు. కమలాపూర్ సభలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందనే వాస్తవాన్ని మాత్రమే ప్రస్తావించారని తెలిపారు. అదేవిధంగా కమలాపూర్‌లో ఉప్పల్ మండలంగా ప్రకటించాలని ప్రజల తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ అంశాలను వక్రీకరించి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైన రాజకీయ సంస్కృతి కాదన్నారు. ఎమ్మెల్యే ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని, రైతులు, యువత, మహిళలు, దళితులు, బీసీలు, అభివృద్ధి, సాగునీరు, నిధులు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మద్దతుతో పనిచేస్తున్న నాయకులను వ్యక్తిగతంగా కించపరచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో అంతిమ తీర్పు ప్రజలదేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, హుందాతనం పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

**దేశిని కోటి నోరు అదుపులో పెట్టుకో..**
**- వైస్ చైర్మన్ జావేద్**

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేత దేశిని కోటికీ లేదని నిజాలు తెలుసు కోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నీవు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై నోరు జారితే నియోజకవర్గంలో తిరుగనీయమని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని తెలిపారు. ఇంకొకసారి ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జావేద్ హెచ్చరించారు.



# మెడికవర్‌లో ప్రతి నెల ఉచిత క్యాన్సర్ శిబిరం

తొలి శిబిరంలో 186 మందికి పరీక్షలు, 26 మందికి క్యాన్సర్ నిర్ధారణ

మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ



**కరీంనగర్, ఆగస్టు13(సింగిడి):** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ తెలిపారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరానికి 186 మంది హాజరై వివిధ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి క్యాన్సర్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇకపై ప్రతి నెల రెండో గురువారం ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ కరీంనగర్‌లో ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. లక్షణాలు బయటపడకముందే పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి సకాలంలో చికిత్స అందించవచ్చన్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే దశ పెరిగే కొద్దీ చికిత్స క్లిష్టతరమవుతుందని హెచ్చరించారు. ఊబకాయాన్ని నియంత్రించుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. ప్రజలు ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకుని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెడికవర్ కేంద్రం అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కేంద్రం అధిపతి సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, ప్రజా సంబంధాల అధికారి అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికను కాపాడిన యువకులకు ఏసీపీ సన్మానం




**మంథని, ఆగస్ట్ 13(సింగిడి):** బొక్కలవాగులో నీటిలో మునిగిపోతున్న బాలిక అలేఖ్యను ధైర్యసాహసాలతో రక్షించిన బోయినిపేటకు చెందిన అంకం శేఖర్, ఆకుల అరవింద్‌లను గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ అభినందించి సన్మానించారు. బాలికను రక్షించిన అనంతరం ఆమె తండ్రి పర్శవేన రాజును కూడా వాగులో నుంచి బయటకు తీసేందుకు యువకులు ప్రయత్నించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆపద సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి బాలిక ప్రాణాలు కాపాడిన యువకుల ధైర్యసాహసాలు అభినందనీయమని ఏసీపీ పేర్కొన్నారు. మంథని సీఐ బుద్ధె స్వామి, ఎస్ఐ సాగర్ పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ

**జమ్మికుంట, ఆగస్టు 13 (సింగిడి):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో 500 మీటర్ల జాతీయ జెండా తో డిగ్రీ కళాశాల నుండి గాంధీ చౌరస్తా వరకు విద్యార్థిని విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొలకాని రాజు, చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మన జాతీయ జెండా కేవలం మూడు రంగుల వస్త్రం కాదని, ఇది మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రతీక, మన దేశ ఐక్యతకు చిహ్నం, కోట్లాది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతిరూపం అని కొనియాడారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, మన దేశంపై ఉన్న గౌరవాన్ని, దేశభక్తిని ప్రపంచానికి చాటాలని,మన జెండాను గౌరవించడం అంటే మన దేశాన్ని గౌరవించడం. మన దేశాన్ని బలంగా స్వచ్ఛంగా, అభివృద్ధి చెందిన భారతదేశంగా నిర్మించేందుకు ప్రతి ఒక్కరం మన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ జావీద్, కౌన్సిలర్లు చందా రాజు మాచర్ల రాజు శీలం శ్రీనివాస్, కొలకాని రాజకుమారి, గుర్రం కావ్య పరుశురాం, నాయకులు ఆకుల రాజేందర్ జీడి మల్లేష్ పాల్గొన్నారు.




## కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**జమ్మికుంట, ఆగస్టు 13 (సింగిడి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలిసే విధంగా జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోనాల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల వేషాలతో పాటు అమ్మవారి అలంకరణలతో బోనాల నెత్తిన పెట్టుకొని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకొని పెద్దలను గౌరవించడంతోపాటు ఆ పండగలను భవిష్యత్తులో అత్యంత ఘనంగా జరపాలనే ఉద్దేశంతో పాఠ్య పుస్తకాలతో సమానంగా సంస్కృతి గురించి కూడా బోధించడం జరుగుతుందని వెల్లడించారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు


ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్




**కరీంనగర్, ఆగస్టు13(సింగిడి):** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి జూంజకి తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ సంక్షోభంలోకి నెడుతోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి కారణంగా విద్యార్థులు కళాశాలల నుంచి ధ్రువపత్రాలు పొందేందుకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు అందలేదని, మౌలిక వసతుల కొరతతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన ఉదయం అల్పాహార పథకాన్ని వెంటనే అమలు చేయాలని, విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. కరీంనగర్ సైన్స్ కళాశాలలో తరగతి గదుల కొరతను పరిష్కరించి నూతన భవనం నిర్మించాలని, జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, జిల్లా బాలికల కన్వీనర్ మానస, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంజన, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్‌సాగర్, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అకడమిక్ ప్యానల్ తనిఖీలకే పరిమితం కాకూడదు

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 13(సింగిడి):** అకడమిక్ ప్యానల్ పాఠశాల సందర్శనలు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అకడమిక్ సహకారం అందించేలా ఉండాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారుల శిక్షణలో పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్‌మెంట్, నిర్మాణాత్మక ఫీడ్‌బ్యాక్, డేటా ఆధారిత ప్రణాళిక, నిరంతర ఫాలోఅప్ ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు.

# ప్రణవ్‌ను విమర్శిస్తే సహించేది లేదు..

- పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 13 (సింగిడి):** రాష్ట్రప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఒక్క ఉద్యోగానికి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేని దౌర్భాగ్య ప్రభుత్వాన్ని నమ్మకనే రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలబడుతుందని నమ్మి అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిందని జమ్మికుంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని అలాంటి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరకుండా అడ్డుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు చేయడమే హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆయన మండి పడ్డారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో మమ్మల్ని గెలిపించకపోతే మా శవయాత్రకు రండి అంటూ ప్రజలను మోసం చేసి గెలుపొందిన కౌశిక్ రెడ్డి నిజాయితీగా నిస్వార్థంగా అవినీతి లేకుండా ప్రజాసేవ చేస్తున్న నియోజకవర్గం ఇన్చార్జి ప్రణవ్ బాబు పై రాష్ట్రప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడితే ప్రజాక్షేత్రంలో తిరగనివ్వమని ఆయన హెచ్చరించారు. మంచితనాన్ని చేతగానితనం అనుకుంటే నష్టపోయేది బిఆర్ఎస్ నాయకులే అని ఆయన అన్నారు. సంస్కారవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చిల్లర రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీలో లేదని మా నాయకుడు ఆదేశిస్తే మేము కూడా మీ కన్నా గట్టిగా మాట్లాడతామని ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల్లో హుజురాబాద్ నుండి భారీ మెజార్టీతో ప్రణవ్ బాబు గెలుస్తున్నాడని ప్రజల మద్దతు ఆయనకు ఉందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై ప్రణవ్ బాబును గానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గాని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు మానుపాటి సూర్య నాయినేని రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్ పట్టణ నీటి నిర్వహణ విధానాలు స్ఫూర్తిదాయకం

● కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్



**హనుమకొండ,ఆగస్టు 13 (సింగిడి):** పట్టణాల్లో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలు, సమర్థవంతమైన పాలనా వ్యవస్థలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ఇజ్రాయెల్‌లోని వివిధ నగరాల్లో అర్బన్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై నిర్వహించిన అధ్యయన పర్యటనలో కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌లో పట్టణ నీటి నిర్వహణ, నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం, నీటి మౌలిక వసతుల నిర్వహణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి కొరతను సవాలుగా కాకుండా సాంకేతికత, ఆవిష్కరణలు, సమర్థవంతమైన పాలన ద్వారా అవకాశంగా మార్చుకోవడంలో ఇజ్రాయెల్ అనుభవాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. సముద్రపు నీటిని శుద్ధి చేసి వినియోగించడం, శుద్ధి చేసిన మురుగునీటిని దాదాపు 90 శాతం వరకు వ్యవసాయ అవసరాలకు పునర్వినియోగించడం, జీ ఐ ఎస్ ఆధారిత నీటి మౌలిక వసతుల మ్యాపింగ్, నాన్-రెవెన్యూ వాటర్ (ఎన్ ఆర్ డబ్ల్యు)ను 5 శాతం కంటే తక్కువ స్థాయిలో నియంత్రించడం వంటి విధానాలు పట్టణ నీటి నిర్వహణలో ఇజ్రాయెల్ సాధించిన పురోగతికి నిదర్శనమని తెలిపారు. అదేవిధంగా నదుల పునరుజ్జీవనం, పట్టణ జల వనరుల పరిరక్షణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, ఎడారీకరణ నివారణకు చేపడుతున్న పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నీటి నిర్వహణలో విస్తృతంగా వినియో గిస్తున్న తీరును అధ్యయనం చేసినట్లు తెలిపారు. అధ్యయన పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్‌లో భారత రాయబారి శ్రీ జె.పి. సింగ్‌ను కలుసుకుని భారత్--ఇజ్రాయెల్ సహకారం, ముఖ్యంగా పట్టణ నీటి నిర్వహణ రంగంలో ఇరు దేశాల మధ్య ఉన్న అవకాశాలు, అనుభవాలపై ఆయన నుంచి విలువైన సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నట్లు కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా పొందిన అనుభవాలు వరంగల్ నగర అండర్‌గ్రౌండ్ సీవరేజ్ సిస్టమ్ (యూ జీ ఎస్ ఎస్ ), తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం,జీ ఐ ఎస్ ఆధారిత నీటి మౌలిక వసతుల నిర్వహణ, నాన్-రెవెన్యూ వాటర్ తగ్గింపు, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పట్టణ చెరువులు, కుంటలు, ఇతర జల వనరుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాల్లో ఎంతో ఉపయోగ పడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అధ్యయన పర్యటనలో ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో పాటు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యీ, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ డైరెక్టర్లు, పట్టణాభివృద్ధి రంగానికి చెందిన అధికారులు, పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ నిర్వహణపై రాష్ట్ర అధికారి తనిఖీ



**కోదాడ, ఆగస్టు 13 (సింగిడి):** కోదాడ పట్టణంలోని 108 అంబులెన్స్‌ను రాష్ట్ర యాంత్రిక కార్యనిర్వహణ అధికారి సూర్యనారాయణ రాజు బుధవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలు, ఆక్సిజన్ సదుపాయం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. వాహనం సక్రమంగా పనిచేస్తుందా, పరికరాలు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందేలా అంబులెన్స్‌లను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో 108 జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సలీం, జిల్లా కోఆర్డినేటర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను అణచివేస్తున్న ప్రభుత్వం



**మిర్యాలగూడ ఆగస్టు 13 (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను ప్రతి రంగంలో అణిచివేయడాన్ని విమర్శిస్తూ మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు కూడా ప్రతి రంగంలో బీసీలను అవమానిస్తూ అణిచివేస్తున్నారు చదువుకునే విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా బీసీ విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నారు అలాగే ఉద్యోగ రంగంలో కూడా బీసీల కు అవకాశాలు లేకుండా చేస్తున్నారు రాజకీయ రంగంలో బీసీల జనాభా కు తగిన విధంగా పదవులను కేటాయించలేక పోతున్నారు బీసీలకు చట్ట సభలలో జనాభా ప్రాతినిధ్య ప్రకారం రిజర్వేషన్లు కావాలని ఎంతోకాలంగా ఉద్యమిస్తున్నప్పటికీ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదు అని ఆయన అన్నారు .. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు ,బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి గంగాధర్, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు సతీష్, రాంబాబు, ఉపేందర్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయం పార్కును పరిశీలించిన ఆర్డీవో



**కోదాడ, ఆగస్టు 13 (సింగిడి):** కోదాడ పట్టణంలోని గ్రంథాలయం పార్కును ఆర్డీవో సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. పార్కులోని వసతులు, పరిసరాలు, పరిశుభ్రతను పరిశీలించి ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసు కున్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కును మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. గ్రంథాలయాన్ని ఆనుకుని ఉన్న పూల దుకాణం వెనుకవైపు డోర్లను తక్షణమే మూసివేయాలని, అక్కడ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ట్రైనీ ఆర్డీవోలు బి. రవితేజ, కె. అనూష ఉన్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం




**కోదాడ, ఆగస్టు 13 (సింగిడి):** 91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను కాపాడేందుకు పోరాడాలని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు మేకల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోదాడ పట్టణంలోని పాత వాగ్దేవి జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. చదువుతూ--చదువుకై పోరాడు' నినాదంతో సాగిన 91 ఏళ్ల ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం--2020తో విద్యారంగంలో కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు మార్గం సుగమం అవుతోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు పెంచి, ఉచిత నాణ్యమైన విద్య, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ నాయకులు షేక్ నాగుల్‌మీరా, బి. మహేష్, నాగేంద్రబాబు, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, నవీన్, గోపి, ఉపేందర్, సుష్మ, భారతి, అఫ్రీన్, భాను, శైలజతో పాటు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మూగజీవాల స్థలంలో నిర్మాణాలు వద్దు..

● పశువుల బతుకులకు దిక్కెవరు?

● 80 ఏళ్లుగా బందెల దొడ్డి..



**కోదాడ, ఆగస్టు 13 (సింగిడి):** అనంతగిరి మండలంలోని మొగలాయికోట గ్రామంలో పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర మూగజీవాలకు ఆశ్రయంగా ఉన్న బందెల దొడ్డి స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించవద్దని గ్రామస్తులు కోరారు. గత 80 ఏళ్లుగా బందెల దొడ్డిగా వినియోగిస్తున్న ఈ స్థలంలో శ్రీశక్తి భవనం నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారని, ఇందులో భాగంగా పశువుల కోసం గ్రామస్తులు ఏర్పాటు చేసిన స్టాండ్‌ను తొలగిస్తున్నారని తెలిపారు. గ్రామంలోని పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర జంతువుల కోసం తమ తండ్రి గాయం వెంకట్‌రెడ్డి ఈ స్థలాన్ని దానంగా ఇచ్చారని ఆయన కుమారుడు గాయం అప్పిరెడ్డి తెలిపారు. దానం చేసిన స్థలాన్ని బందెల దొడ్డికే వినియోగించాలని, ఇతర నిర్మాణాలు చేపట్టడం సరికాదన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఆంబోతు మృతి చెందగా ఇదే స్థలంలో ఖననం చేశామని గుర్తుచేశారు. బందెల దొడ్డి స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. దాతల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు స్థలాలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారని అప్పిరెడ్డి అన్నారు. ఇదే స్థలంలో ఇతర ఏ నిర్మాణాలు జరిపినా సహించేది లేదని,అవసరమైతే కుటుంబంతో సహా నిరాహార దీక్షకు దిగుతామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామస్తులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి బి. వెంకటేశ్వర్లుకు అందజేశారు. అంతేకాకుండా ఇన్చార్జి ఎంపీడీవో షేక్ సుష్మ, పంచాయతీరాజ్ ఏఈ,డీఈ లకు సోషల్ మీడియా ద్వారా సమాచారం అందించినట్లు వారు తెలిపారు.

**స్థలం కొరతతోనే స్త్రీశక్తి భవనానికి తీర్మానం..**
**- ఎంపీడీవో సుష్మ...**

ఇదే విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో సుష్మను వివరణ కోరగా.. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి స్థలాన్ని గ్రామపంచాయతీకి దానం చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. అయితే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో స్థలం కొరత ఉండటంతో ప్రస్తుతం వినియోగంలో లేని బందెల దొడ్డి స్థలాన్ని స్త్రీశక్తి భవనానికి వినియోగించేందుకు తీర్మానం చేసినట్లు ఆమె స్పష్టం చేశారు.

# జాతీయత భావం పెంపొందించడమే లక్ష్యం

● బిజెపి భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి కీర్తి రెడ్డి

● ఘనంగా హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ




**భూపాలపల్లి, ఆగస్టు 13 (సింగిడి):** నరేంద్రమోదీ పిలుపుమేరకు రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు 79వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై సుమారు 300 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తిని చాటారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, ఉత్సాహం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతదేశం పట్ల తమకున్న గౌరవాన్ని, జాతీయ పతాకంపై ఉన్న అభిమానాన్ని విద్యార్థులు ఘనంగా చాటుకున్నారు. పట్టణ ప్రముఖులు, మేధావులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయత భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. మనమంతా భారతీయులమే అనే బావనతో దేశంపై విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ జెండా కింద ప్రజలంతా ఐక్యంగా ఉంటే దేశాన్ని ఏ శక్తి ఓడించలేదన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పోస్ట్ ఆఫీస్ ల ద్వారా జాతీయ జెండాలలో అందుబాటులోకి తెచ్చిందని, గ్రామాల్లో అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి జెండాలు అందించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగరవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నం యుగంధర్, ఎరుకల గణపతి, జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**హనుమకొండ,ఆగస్టు 13 (సింగిడి):** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు 56వ డివిజన్లో బుధవారం పర్యటించారు. 56వ డివిజన్లోని వివేక నగర్,జవహర్ కాలనీ,పరిమళ కాలనీ, శ్రీ సాయి నగర్ కాలనీలలో సుమారు రూ 3.85కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తూ డివిజన్ల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని,డివిజన్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం గోపాలపురం జంక్షన్లోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు కాలనీ వాసులకు గతంలో ఎమ్మెల్యేనీ కలిసి సహాయం కోరడంతో వారికి బుధవారం ఎమ్మెల్యే రూ 2. 5లక్షల రూపాయలను వారికి అందజేశారు. కార్యక్రమంలో 56వ డివిజన్ అధ్యక్షులు కొంకా హరిబాబు,ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కందుకూరి పూర్ణచందర్,కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి దూలం సదానందం,సీనియర్ నాయకులు చింత రమేష్,మర్రి ప్రభాకర్,దూలం పరమేష్,చింతరెడ్డి రవీందర్ రెడ్డి,నలుబాల దామోదర్, చిప్ప ప్రభాకర్,బోనగాని రాంప్రసాద్,రమేష్,డివిజన్ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి శనిగరపు అనిత,మహిళ నాయకురాలు పల్లకొండ సరోజన,గుగులోతు స్వరూప,అన్న విజయ, యూత్ నాయకులు లావుడియా రవి నాయక్, పాలకొండ విజయ్ సూర్య, ఇమ్మడి రాజీవ్,సుందర్, రామకృష్ణ,సందీప్ ప్రేమ్ సాగర్, మహమ్మద్ రియాజ్, కిషోర్,గొల్లపల్లి చిరంజీవి, రవి, వంశీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ రాజకీయాల్లో మార్పు రావాలి

### పల్లా దేవేందర్‌రెడ్డి




**చింతపల్లి, ఆగస్టు 13 (సింగిడి):** దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి విముక్తి కలగాలన్నా, కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నా రాజకీయ మార్పు అవసరమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యా వ్యవస్థలో లోపాలు, పేపర్ లీకేజీలు, ప్రజాస్వామ్య హక్కుల హరణం వంటి సమస్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. కుల, మతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టి ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, విద్య, ఆరోగ్యం, మహిళా భద్రత, పర్యావరణం తదితర రంగాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తి, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం సీపీఐ పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు డి. సుదర్శన్‌రెడ్డి, ఎస్. కనకాచారి, ఎం.డి. మైనుద్దీన్, పల్లా రంగా రెడ్డి, శైలేష్, ఏం. శేఖరాచారి, బుచ్చయ్య, శంశుద్దీన్, కె. వెంకటయ్య, పల్లపు లక్ష్మయ్య, రామకృష్ణ, వెంకటరత్నం, బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## సమీకృత వ్యవసాయంతో రైతులకు అదనపు ఆదాయం




**ఆలేరు, ఆగస్టు 13 (సింగిడి):** పంటల సాగుతో పాటు పశుపోషణ, కోళ్ల పెంపకం, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు వంటి అనుబంధ కార్యకలాపాలను చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలోని రైతు వేదికలో బుధవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాధార ప్రాంతాల్లో సమీకృత వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, సాగునీటి కొరతను అధిగమించేందుకు పంటల వైవిధ్యీకరణ ఎంతో ఉపయోగపడుతుందని ఆలేరు ఏడీఏ నిర్మల తెలిపారు. భూమి, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలకు అనుగుణంగా కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. తెలంగాణ భువనగిరి రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీలత మాట్లాడుతూ ఒకే పంటపై ఆధారపడకుండా పంటలతో పాటు పశుపోషణ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా ఆదాయ వనరులను విస్తరించుకోవచ్చన్నారు. పంటల అవశేషాలను పశుగ్రాసంగా, పశువుల పేడ, మూత్రాన్ని జీవ ఎరువుల తయారీలో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పొలాల గట్లపై పండ్ల మొక్కలు, కూరగాయలు, పశు గ్రాస పంటలు, అనువైన చెట్లను పెంచుకోవడం ద్వారా అదనపు ఆదాయంతో పాటు భూమి సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పి ఏ సి ఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి, సర్పంచ్ యాదిరెడ్డి, ఉప సర్పంచ్‌లు యాదగిరి, దశరథ, ఏఈవోలు అంజయ్య, శివకుమార్, భార్గవి, తిరుమలరావు, ఆత్మ బీటీఎం వేణు, రైతులు పాల్గొన్నారు.

## వేతనాలు కోత సరే.. చికిత్సలు ఏవి.?

● బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దశరథ నాయక్



**మిర్యాలగూడ ఆగస్టు 13 (సింగిడి):** మూడు నెలలుగా వేతనాలలో కోత ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షన్ దార్లకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల హెల్త్ కార్డులు ఇప్పటికీ డౌన్లోడ్ కావడం లేదని,చికిత్సలు అందించడం లేదని అయినప్పటికీ మూడు నెలల్లో వేతనాలలో కోత విధించి ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ ప్రశ్నించారు. బుధవారం మిర్యాలగూడలో నిర్వహించిన బంజారా ఉద్యోగుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షన్ దార్లకు కార్పొరేట్ వైద్యం అందించడం కోసం వారి వేతనంలో బేసిక్ పే లో 1. 5శాతం తీసుకుని మూడు నెలలు దాటిన చికిత్సలు అందించకపోవడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఒకవైపు చికిత్సలు అందించే విషయంలో ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రులతో సరైన ఒప్పందం చేసుకోక పోవడం మరోవైపు చికిత్స అందించకుండానే వేతనాల్లో కోత విధించడం ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షన్ దారులను అవమానాలకు గురి చేయడం లాంటిదేనని అన్నారు. ఇప్పటికే లక్షలాదిమంది ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షన్ దారులు కార్డులు డౌన్లోడ్ అవుతాయోమో అని ఆశతో నెట్ సెంటర్ లో చుట్టూ తిరుగుతున్నారని, కొంతమంది ఉద్యోగ ఉపాధ్యాయులు,పెన్షన్ దారులు చికిత్సల కోసం ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. చికిత్సలు అందించకుండానే వేతనంలో కోత విధించిన మే,జూన్,జూలై నెలల వేతనాలను తిరిగి ఉద్యోగుల, పెన్షన్ దార్ల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హెల్త్ స్కీమ్ కమిటీలో సభ్యులుగా ఉన్న వివిధ సంఘాల సంఘాల నాయకులు ఈ విషయమై నోరు మెదపకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. హెల్త్ కార్డుల జారీ చికిత్సలు అందించే విషయంలో ప్రభుత్వం తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మక్ల, సైదా, జామ్లా లక్ష్మణ్ నాయక్, శ్రీను నాయక్,చీనా నాయక్,రమేష్ లాలు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మౌలిక వసతుల విస్తరణపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**హన్మకొండ, ఆగస్టు 13 (సింగిడి):** వరంగల్ జిల్లాలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు 4జీ, 5జీ మొబైల్ సేవల విస్తరణ, నెట్‌వర్క్ బ్లాక్‌స్పాట్ల తొలగింపు, కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటు తదితర అంశాలపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో జిల్లాలో మొబైల్ కనెక్టివిటీ విస్తరణ స్థితి, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరై ఏర్పాటు చేసిన టవర్ల వివరాలు, నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరణ కోరారు. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానమిచ్చారు. జూన్ 2026 నాటికి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 218 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 217 గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ, 216 గ్రామాలకు 4జీ సేవలు అందుతున్నాయని వెల్లడించారు. 47 గ్రామాల్లో 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో డిజిటల్ కనెక్టివిటీ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఒక్క గ్రామం కూడా నెట్‌వర్క్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదని, 4జీతోపాటు 5జీ సేవలను కూడా విస్తరించాలని వరంగల్ ఎంపీ కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ సేవలు, డిజిటల్ లావాదేవీలకు నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ అత్యవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న నిధులను సద్వినియోగం చేసుకుని వరంగల్‌లో మిగిలిన నెట్‌వర్క్ లోటుపాట్లను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించడమే నా లక్ష్యం అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు.

## స్నేహమేరా జీవితం అంటూ నినదించిన చిన్ననాటి మిత్ర బృందం



**మిర్యాలగూడ ఆగస్టు 13 (సింగిడి):** ఒకటి కాదు రెండు కాదు 30 సంవత్సరాల ముందటి ముచ్చట.. 1996 సంవత్సరంలో 5వ తరగతి నుండి కలిసి చదువుకున్న విద్యార్థులు అంతా పదోతరగతి అభ్యసించిన తర్వాత విడిపోవడం సహజమే అలా విడిపోయిన వారు ఉన్నత విద్య ఇతర వ్యాపారాలు కుటుంబ పరమైన కోరికలతో వేరు వేరుగా ఉన్నవారు ఇటీవల కొందరి ప్రమేయంతో ఆ పదో తరగతి విద్యార్థులంతా ఒక వేదికలో ఆత్మీయంగా కలుసుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలో నేతాజీ పాఠశాలలో పదవ తరగతి విద్యాభ్యాసం చేసిన వారందరూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకొని కలుసుకున్నారు. వారిలో కొందరు ఉన్నత విద్యను అభ్యసించి మంచి హోదాలో ఉండగా, మరికొందరు వ్యాపారాలు చేసుకుంటూ కొందరు విదేశాల్లో స్థిరపడిన వారందరూ ఆత్మీయ సమ్మేళనంలో కలిసి చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాలలో మునిగిపోయారు. తమ పాఠశాల రోజుల్లో తాము చేసిన అల్లరి,చిలిపి చేష్టలను ఒకరికి ఒకరు గుర్తు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఇప్పటినుండి మనమంతా దోస్త్ మేరా దోస్త్ అంటూ ఆప్యాయంగా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని మన అందరిలో ఎవరికి ఏ సమస్య వచ్చినా మేమున్నాం అంటూ సహకరించాలని పరస్పరం వాగ్దానాలు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో తాహెర్, రజాక్, ప్రవీణ్, సత్యం, ఉస్మాన్,రవి, సైదా, ముజాఫిర్, ఫెరోజ్, రామన్ బృందం పాల్గొన్నారు

singidinews@gmail.com

# పెరుగులో ఉప్పు మంచిదా లేదా చక్కెరా..?

అతివ Athiva
శుక్రవారం
14-8-2026



రోజువారీ ఆహారంలో పెరుగును ఒక ముఖ్యమైన భాగం చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పెరుగు శరీరాన్ని చల్లబరుస్తుంది , జీర్ణ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది తినడానికి కేవలం రుచికరంగా ఉండటమే కాకుండా, జీర్ణక్రియను వేగవంతం చేయడానికి , రకరకాల కడుపు సమస్యలకు కూడా అద్భుతంగా మేలు చేస్తుంది. కొంతమంది పెరుగును ఉప్పుతో తినడానికి ఇష్టపడితే, మరికొందరు పెరుగును చక్కెరతో తినడానికి ఇష్టపడతారు. చాలా మందికి ఉప్పు పెరుగు తినడమే మొదటి ఎంపికగా ఉంటుంది. మరి నిపుణులు ఏం చెబుతున్నారు? దాని వెనుక ఉన్న అసలు ఆరోగ్య రహస్యం ఇప్పుడు తెలుసుకుందాం.

### జీర్ణక్రియను మెరుగుపరిచే ఉప్పు పెరుగు

ఈ విషయంపై ఆయుర్వేద నిపుణులు , ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన డాక్టర్ పీయూష్ మహేశ్వరి మాట్లాడుతూ ఉప్పు , వేయించిన జీలకర్ర గింజలతో కలిపిన పెరుగును తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఇది జీర్ణవ్యవస్థను , కడుపు ఆరోగ్యాన్ని అద్భుతంగా మెరుగుపరుస్తుంది. కొంతమందికి ఉప్పుతో కూడిన పెరుగు చాలా సులభంగా జీర్ణమవుతుంది. అయితే అధికంగా ఉప్పు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. అందువల్ల అధికంగా ఉప్పు ఉన్న పెరుగును తినడం పూర్తిగా మానుకోవాలి. అంతేకాకుండా అధిక రక్తపోటు సమస్యలతో బాధపడేవారు ఉప్పు ఉన్న పెరుగును తినే ముందు ఖచ్చితంగా నిపుణుడిని సంప్రదించడం ఎంతో అవసరం.

### తక్షణ శక్తినిచ్చే చక్కెర పెరుగు

ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం పెరుగు , పంచదారల కలయిక కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది శరీరానికి తక్షణ శక్తిని అందించి, పెరుగు రుచిని అద్భుతంగా పెంచుతుంది. పంచదార పెరుగులోని పులుపును తగ్గిస్తుంది, దీనివల్ల తీపి ఇష్టపడేవారికి ఇది మరింత ఇష్టమైనదిగా మారుతుంది. పంచదార కలపడం వల్ల పెరుగులోని చల్లదనం కూడా తగ్గుతుంది, ఇది వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. అయితే చక్కెరను అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి అస్సలు ప్రయోజనకరం కాదు. అందువల్ల పెరుగు , చక్కెరను ఎల్లప్పుడూ మితంగానే తీసుకోవాలి. ఒకవేళ మీరు మధుమేహం, ఊబకాయం లేదా మరేదైనా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుంటే, మీ ఆహారం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. మీకు ఏవైనా సందేహాలు ఉంటే, వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించి, పైన చెప్పిన చిట్కాలను పాటించాలి.

### ఆయుర్వేదం చెప్పే ముఖ్యమైన నియమాలు

పెరుగు వినియోగానికి సంబంధించి ఆయుర్వేదంలో కొన్ని నియమాలు ఉన్నాయి. సాధారణ చక్కెర బదులుగా మిశ్రి, బెల్లం లేదా సహజ తీపి పదార్థాలు కలిగినవి మంచివి. అలాగే ఉప్పు విషయానికి వస్తే దానిని మితంగా తీసుకుంటేనే ఎక్కువ ప్రయోజనకరంగా భావిస్తారు. ఆయుర్వేదం ప్రకారం ఒక వ్యక్తి శరీర తత్వం అంటే ప్రకృతి, రుతువు , ఆరోగ్య పరిస్థితిని బట్టి పెరుగును తీసుకోవాలి. పెరుగును అత్యంత పోషకమైన రూపంలో తీసుకోవడానికి దానికి తాజా పండ్లు, వేయించిన జీలకర్ర, పుదీనా, దోసకాయ లేదా ఇతర పోషక పదార్థాలను జోడించవచ్చు. ఇది రుచిని , పోషక విలువను రెండింటినీ పెంచుతుంది. కానీ ఉప్పు లేదా చక్కెర దేనినైనా సరే అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం అని గుర్తించాలి.

## 52 dB ANC తో వన్‌ప్లస్ కొత్త ఇయర్‌బడ్స్

ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ కొత్త ఇయం ఫోన్స్‌ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. గతంలో నార్డ్ బడ్స్ 4 ప్రోను లాంచ్ చేసిన ఈ కంపెనీ.. తాజాగా అదే లైనప్‌లో నార్డ్ బడ్స్ 4ను తీసుకొచ్చింది. 52ఎదీ యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్, 54 గంటల బ్యాటరీ బ్యాకప్ వంటి ఫీచర్లతో దీన్ని తీసుకొచ్చారు. ఏఐ ట్రాన్స్‌లేషన్, గేమ్ స్పేషియల్ ఆడియో వంటి కొత్త ఫీచర్లను జోడించింది.

52dB రియల్ టైం యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్, 6 మైక్రో ఏఐ క్లియర్ కాల్ నాయిస్ క్యాన్సిలేషన్, వన్‌ప్లస్ 3డీ స్పేషియల్ ఆడియో, వన్‌ప్లస్ గేమ్ సౌండ్ స్పేషియల్ ఆడియో, టచ్ కంట్రోల్, ఏఐ ట్రాన్స్‌లేట్, ఏఐ అసిస్టెంట్ వంటి సదుపాయాలు ఈ బడ్స్‌లో ఉన్నాయి. ఐపీ 55 రేటింగ్ ఇచ్చారు. 12ఎఎ టైటానియం కోటెడ్‌తో వస్తోంది. గత జనరేషన్‌తో పోలిస్తే 200 శాతం బెటర్ ANC ఉన్నట్లు కంపెనీ చెబుతోంది.

ఇయర్‌ఫోన్స్‌లో 62 ఎంఏహెచ్ బ్యాటరీ, ఛార్జింగ్ కేస్ 530ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తోంది. కేస్‌ం ఇయర్ ఫోన్స్ 54 గంటల బ్యాటరీ బ్యాకప్




ఇస్తుందని కంపెనీ పేర్కొంది. ఇయర్ ఫోన్స్ విడిగా అయితే 13 గంటల ప్లేబ్యాక్ అందిస్తుంది. ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. ఇయర్ బడ్స్ 4.3 గ్రాముల బరువు, ఛార్జింగ్ కేస్‌తో కలిపి 42.5 గ్రాముల బరువు ఉంటుంది. బ్లుటూత్ 6.1, బ్లూటూత్ ఏఏసీ వంటి కనెక్టివిటీ ఉంది. వన్‌ప్లస్ నార్డ్ బడ్స్ 4 ధరను రూ. 3,299గా కంపెనీ నిర్ణయించింది. లాంచ్ ఆఫర్‌లో భాగంగా రూ. 3,099కే అందిస్తోంది. స్టెల్లార్ బ్లాక్, ఆస్ట్రల్ టీల్ రంగుల్లో అందుబాటులో ఉంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్, మింత్రా, వన్‌ప్లస్ వెబ్‌సైట్‌లో జూన్ 29 నుంచి కొనుగోలు చేయొచ్చు.

## గూగుల్‌లో ఏఐ బ్రెయిన్ డ్రెయిన్..
# మరో ఇద్దరు కీలక ఉద్యోగులు ఔట్?

అమెరికాకు చెందిన బిగ్ టెక్ కంపెనీ గూగుల్‌కు దెబ్బమీద దెబ్బ పడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో కంపెనీల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న వేళ కీలక వ్యక్తులు సంస్థను వీడుతున్నారు. ముఖ్యంగా స్టార్టప్ కంపెనీలైన ఆంథ్రోపిక్, ఓపెన్ ఏఐ నుంచి గూగుల్‌కు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ మధ్యే ఇద్దరు వ్యక్తులు సంస్థను వీడగా.. మరో ఇద్దరు కూడా గూగుల్‌ను బయటకు వెళ్లనున్నారన్న వార్తలు సంచలనంగా మారాయి.

గూగుల్ జెమినై మోడల్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన జోనాస్ అడ్లర్, అలెగ్జాండర్ ప్రిట్జెల్ త్వరలో ఆంథ్రోపిక్‌లో చేరనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. జోనాస్ అడ్లర్ గూగుల్ ఏఐ కోడింగ్ విభాగంలో పనిచేస్తుండగా.. ప్రిట్జెల్ ఏఐ సిస్టమ్స్ ట్రైనింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. గూగుల్ ఏఐ మోడళ్ల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన నోబెల్ బహుమతి గ్రహీత జాన్ జంపర్ ఆంథ్రోపిక్‌కు వెళ్లగా.. మరో రీసెర్చర్ నోమ్ షాజీర్ ఇటీవల ఓపెన్ ఏఐకి మారారు.

ఇప్పుడు వీరిద్దరూ కూడా వీడుతారన్న వార్తలు గూగుల్‌కు దెబ్బేనని విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. వీరి నిష్క్రమణ వల్ల ఏఐ మోడళ్ల అభివృద్ధిలో గూగుల్ వెనకబడిపోతుందన్న




ఆందోళనలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. దీంతో బుధవారం గూగుల్ మాతృ సంస్థ అల్ఫాబెట్ షేర్లు 1.2% వరకు పతనమయ్యాయి.

**ఐపీఓ ముందు వలసలు**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో అందరికంటే ముందుగానే గూగుల్ ప్రవేశించినప్పటికీ.. గతేడాది నుంచి




ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్ వంటి స్టార్టప్ కంపెనీల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఏఐ స్టార్టప్ కంపెనీలు త్వరలో పబ్లిక్ ఇష్యూకి వెళ్లే యోచనలో ఉన్నాయి. దీంతో భారీ ఆర్థిక ప్రయోజనాలు దక్కే అవకాశం ఉండడంతో పరిశోధకులు అటువైపు చూస్తున్నారు. ప్రాధాన్యాలు మారుతుండడంతో వల్ల కూడా కొందరు పరిశోధకులు గూగుల్‌ను వీడడానికి కారణంగా చెబుతున్నారు. ఉద్యోగులు వీడడంపై అటు గూగుల్ గానీ, ఆంథ్రోపిక్ గానీ అధికారికంగా స్పందించలేదు. కంపెనీలో వలసలపై గూగుల్ డీప్‌మైండ్ సీఈవో డెమిస్ హస్సాబిస్ స్పందిస్తూ.. టెక్ పరిశ్రమలో టాలెంట్ కోసం ప్రస్తుతం మును పెన్నడూ లేనంత తీవ్రమైన పోటీ నడుస్తోందన్నారు. అదే సమయంలో ఇతర ల్యాబ్‌లతో పోలిస్తే అతి పెద్ద, ప్రతిభావంతులైన బృందం తమ వద్ద ఉందని పేర్కొన్నారు.

## లాభాల స్వీకరణ..

### గరిష్ఠాల నుంచి 700 పాయింట్లు డౌన్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్‌లు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ లాభాల్లో కదలాడిన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత లాభాల స్వీకరణకు దిగడంతో దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ 700 పాయింట్లు క్షీణించింది. నిఫ్టీ 24 వేల ఎగువన ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 77,391.07 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,991.22) లాభాలతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,803.18 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో చివరికి 109.25 పాయింట్ల లాభంతో 77,100.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 34.35 పాయింట్ల లాభంతో 24,056 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.40గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బీఈఎల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్ 72 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3984 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## భారత్‌లో అమెజాన్
# భారీ పెట్టుబడులు..
### మోదీతో సీఈవో భేటీ

ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ గురువారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఏఐ, క్లౌడ్ సేవలను భారత్‌లో భారీగా విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం రానున్న 5 ఏళ్లలో అదనంగా 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. ఆరు నెలల క్రితం దేశంలో 35 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని అమెజాన్ వెల్లడించగా.. తాజా ప్రకటనతో తమ మొత్తం పెట్టుబడి ప్రణాళికలు 48 బిలియన్ డాలర్లకు చేరాయని అమెజాన్ సీఈవో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా మోదీతో కలిసిన ఫొటోలను పంచుకున్నారు.

"భారత్‌లో దీర్ఘకాల వాణిజ్యానికి అమెజాన్ కట్టుబడి ఉంది. 2030 నాటికి ఏఐ, క్లౌడ్ సేవలను భారీగా విస్తరించనుంది. ఇందుకోసం 48 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాం. 2030 నాటికి 3.8 మిలియన్ ఉద్యోగాలను కల్పిస్తాం. 80



బిలియన్ డాలర్ల ఇ-కామర్స్ ఎగుమతులను సృష్టిస్తాం. 15 మిలియన్ చిన్న వ్యాపారులకు, 4 మిలియన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ ప్రయోజనాలను అందిస్తాం" అని ఆండీ జెస్సీ ఎక్స్ వేదికగా తెలిపారు.

"హైదరాబాద్, ముంబయిలోని ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ల విస్తరణకు ఈ పెట్టుబడులు ఉపయోగించనున్నాం. దీని వల్ల భారత్‌లోని స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఏఐ, క్లౌడ్ సేవలను అందిస్తాం" అని అమెజాన్ పేర్కొంది. అమెజాన్ భారీ పెట్టుబడులను మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆండీ జెస్సీతో గొప్ప భేటీ జరిగింది. భారత్‌లో అమెజాన్ 48 బిలియన్ డాలర్ల పెట్టుబడులను స్వాగతిస్తున్నాం. దీంతో యువతకు కొత్త అవకాశాలు ఏర్పడుతాయి. భారత్‌లో పెట్టుబడులకు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం" అని తెలిపారు.

# యుద్ధం ముందు స్థితికి.. చమురు ధరల పతనం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా-ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం.

ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని




అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.

అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. నేడు అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ. 1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ. 2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ. 2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది.

**లాభాల్లో స్టాక్ మార్కెట్లు..**

మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్ (ానీషిని మీుతీనివ్) సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ (ావఅంవఇ) 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ (చీఅట్ఎ) 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 94.33 వద్ద కొనసాగుతోంది.

## గంజాయి విక్రయానికి యత్నం. ఇద్దరు యువకుల అరెస్ట్

**మల్లాపూర్, (సింగిడి) :** గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు యువకులను మల్లాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మల్లాపూర్ ఎస్సై అనిల్ బుధవారం వెల్లడించారు. ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలం లోని చిట్టాపూర్ గ్రామ శివారులో ఉన్న పౌల్ట్రీ ఫారం వద్ద గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఎంచురాల రిశిత్ రెడ్డి (21), కొండగల్ల రాజ్ కుమార్ (24)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. విచారణలో ఇద్దరూ స్నేహితులమని, గంజాయి సేవించే అలవాటు ఉందని, తరచూ గంజాయి కొనుగోలు చేసి వినియోగించడంతో పాటు మిగిలిన గంజాయిని ఇతరులకు విక్రయించేవారమని వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన బాణాల అరవింద్ ద్వారా గంజాయి పరిచయం అయినట్లు నిందితులు విచారణలో తెలిపినట్లు పేర్కొన్నారు. మల్లాపూర్ మండలంలో గంజాయి అందుబాటులో లేకపోవడంతో అరవింద్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అందులో కొంత భాగాన్ని వినియోగించిన అనంతరం మిగిలిన గంజాయిని విక్రయించేందుకు రిశిత్ రెడ్డి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తుండగా, చిట్టాపూర్ గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫారం వద్ద పోలీసులు వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి కి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలియజేయాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని ఎస్సై అనిల్ తెలిపారు.

### కబ్జా చేసిన ఇందిరమ్మ స్థలం ఇప్పించాలంటూ

## మృతదేహంతో నిరసన

### రోజంతా స్థలం వద్ద మృతదేహం
### అధికారుల హామీతో అంత్యక్రియలు చేసిన కొడుకులు



**జమ్మికుంట, (సింగిడి) :** నిరుపేద కుటుంబా నికి చెందిన నల్ల భూలక్ష్మికి చెందిన నివేషణ స్థలాన్ని కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్న వారి నుండి తమ స్థలాన్ని ఇప్పించా లంటూ కుమారులు మృతదేహంతో ఆ స్థలం ఎదుట రోజంతా ఆందోళన చేసిన సంఘటన చోటు చేసుకుంది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పంచముఖి హనుమాన్ టెంపుల్ సమీపంలోని ఇందిరమ్మ ఇంటి స్థలం లో వివాదం విషాదానికి దారి తీసింది. చల్ల భూలక్ష్మికి చెందిన ఇంటి స్థలాన్ని ఆర్థిక ఇబ్బందుల వల్ల కట్టుకోక పోవడంతో ఇదే అదనుగా భావించిన లోకిని రాజు అనే వ్యక్తి కబ్జా చేసాడని ఆరోపించారు. గత మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నప్ప టికీ న్యాయం జరగలేదని బాధిత కుటుంబ సభ్యులు రమేష్ శ్రీను తెలిపారు. ఈ క్రమంలో చల్ల భూలక్ష్మి తీవ్ర మానసిక వేదనకు గురై మృతి చెందినట్లు ఆమె కుమారులు, బంధువులు తెలిపారు. తమ తల్లి మృతికి స్థల వివాదం కారణమని , ఆ స్థలం మాకు దక్కేంతవరకు మృతదేహాన్ని తరలించేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించారు. మూడు సంవత్సరాలుగా తమ ఇంటి స్థలం కోసం పోరాడుతున్నామని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్య పరిష్కారం కాలేదని వారు వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు బాధిత కుటుంబం ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి, అసలు స్థలం ఎవరిది, కబ్జా జరిగిందా అనే అంశాలను పరిశీలించి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఘర్ ఘర్ క తిరంగా
### నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి



**కీసర, (సింగిడి) :** ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలి నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి కాలనీలలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలకు 400 జాతీయ జెండాలను అందజేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుతూ ఆగస్టు 15న తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని చంద్రారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మెరుగు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### మరకత శ్రీ లక్ష్మి గణపతికి విశేష అభిషేకాలు



**అల్వాల్, (సింగిడి) :** కానాజీ గూడ డైరీ ఫార్మ్ రోడ్లో వెలిసిన మరకత శ్రీ లక్ష్మీగణపతి స్వామివారికి ప్రత్యేక పూజలునిర్వహిం చిన ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. లక్ష్మీగణపతి మూల మంత్రము 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు మహాలక్ష్మీ హోమాలు నిర్వహించారు ఈ పూజలో పాల్గొన్న వారికి అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యం అభివృద్ధి వ్యాపార అభివృద్ధి ధన ప్రాప్తి సర్వ కార్యసిద్ధి కలుగుతుందని డాక్టర్ మోత్కూరి సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు

### ప్రతి ఒక్కరు తమ ఇంటిపై త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించాలి
### . అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి) ::** దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరు త్రివర్ణ పతాకాలను తమ ఇంటిపై ఆవిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని గాంధీ చౌక్ లో బుధవారం త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత స్వాతంత్రానికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాతీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 2022 లో హారిక తిరంగా ప్రారంభించారన్నారు. ప్రతి ఇంటిపై జెండా ఎగరవేసి ప్రజల్లో దేశభక్తి జాతీయ జెండాపై వ్యక్తిగత అనుబంధాన్ని పెంచడం దీని ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. 2022 ఆగస్టు 3న అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఢిల్లీలో ఎర్రకోట నుంచి ఇండియా గేట్ వరకు హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ ని నిర్వహించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, సుధీర్, బంటు రాము, బంటు ప్రీతి, శ్యామల, మల్కాయి మహేందర్, సునీత, బొబ్బిలి సువర్ణ, వైష్ణవి సుధా, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, జ్యోతి మురళి, బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కోశాధికారి ఆమంద్ విజయ్ కృష్ణ, మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

## మహానగరంలోని... చెత్తంతా జవహర్ నగర్ డంపింగ్ లో వేయడం దారుణం

### ప్రజల భద్రత.. జీవించే హక్కును రాంకీ కాలరాయడం సిగ్గుచేటు
### జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి



**జవహర్ నగర్, (సింగిడి) :** మహానగరం లోని చెత్తనంతా జవహర్ నగర్ లో వేయడంతో ఇక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని ప్రభుత్వం వెంటనే నలువైపులా చెత్త యార్డులను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి డిమాండ్ చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ని పురస్కరించుకొని జవహర్ నగర్ ప్రగతి నగర్ నీలం రామచంద్రయ్య భవన్లో కమిటీ సభ్యులు షేక్షావలి ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్షావలి మాట్లాడుతూ అమోనియం మిథెన్ వంటి విష వాయువులతో పిల్లలు వృద్ధులు ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారని ప్రకృతి విధ్వంసానికి కారణమైన రాంకీపై చర్యలు తీసుకోవాలని అన్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాటానికి సముఖంగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్య భద్రత జీవించే హక్కును రాంకీ కాలరాయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మాజీ ప్రజాప్రతినిధులు శాంతి కోటేష్ గౌడ్, లలితా యాదవ్, సంగీత రాజశేఖర్, పల్లపు రవి, వేణు, సాయి, రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, మనోధర్ రెడ్డి, సతీష్ ,సుబ్రహ్మణ్యం, మనోధర్ రెడ్డి, శంకర్, అనురాధ, ప్రవీణ్ పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనుభవపూర్వక అభ్యాసానికి గీతం పెద్దపీట

### ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్ కార్యక్రమం ఏర్పాటు.. చురుకుగా పాల్గొన్న విద్యార్థులు





**పటాన్చెరు, (సింగిడి) :** వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, సాంకేతిక రంగాలలో రాణించడానికి అవసరమైన పరిశ్రమతో అనుబంధం, అనుభవపూర్వక అభ్యాసాలకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా, గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు 'ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్' పేరిట నైపుణ్య పెంపుదల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి, ఉత్పత్తి రూపకల్పన, ఇంజనీరింగ్ లోని తాజా పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక అవకాశాన్ని కల్పించింది. క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సుజయ్ డిసౌజా నేతృత్వంలోని ఆటోడెస్క్ పరిశ్రమ నిపుణులతో కూడిన ఎనిమిది మంది బృందం, విద్యార్థులతో సంభాషించి, అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, ఉత్పత్తి–అభివృద్ధి రంగంపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. కొత్త ఆటోడెస్క్ ఉత్పత్తుల పరీక్ష, అనువర్తనాన్ని కూడా ప్రదర్శించి, విద్యార్థులకు అధునాతన రూపకల్పన, ఇంజనీరింగ్ సాధనాలపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు మూడు వారాల వ్యవధిలో పూర్తి చేయడానికి రూపకల్పన, అనుకరణ, సాంకేతిక చిత్రలేఖనం, చిత్రీకరణ తో కూడిన డిజైన్ సవాళ్లు ఇచ్చారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ప్రాజెక్టు బృందాలు, వ్యక్తిగత ప్రతిభావంతులను వారి పనితీరు, ప్రాజెక్టు ఫలితాల ఆధారంగా అవార్డులతో సత్కరించనున్నారు. విద్యార్థులు, నిజ జీవిత సవాళ్లను పరిష్కరించడానికి ఇంజనీరింగ్ పరిజ్ఞానం, డిజైన్ థింకింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఎలా అన్వయించగలరో ప్రదర్శిస్తూ, బరువును మోయగలిగే ఎక్సోస్కెలిటన్, స్వయంప్రతిపత్తితో పనిచేసే నదీ శుభ్రత రోబోట్ వంటి వినూత్న ఉత్పత్తి–అభివృద్ధి భావనలను కూడా ప్రదర్శించారు. కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రమేష్ వడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ, ఆటోడెస్క్ ప్రతినిధులకు స్వాగతం పలికి, వారిని సత్కరించారు. ఇంజనీరింగ్ వృత్తిలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో పరిశ్రమ–విద్యాసంస్థల సహకారం ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అధ్యాపకుడు డాక్టర్ వీరప్రతాప్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొని, ఆటోడెస్క్ నిపుణులతో అర్థవంతమైన చర్చలలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా ప్రశ్నలడిగి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను బలోపేతం చేసుకోవడానికి, పరిశ్రమ పోకడలను అన్వేషించడానికి, అధునాతన ఇంజనీరింగ్ సాంకేతికతల ఆచరణాత్మక అనువర్తనాలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక సుసంపన్నమైన వేదికను అందించింది.

## గంజాయి విక్రయదారుల అరెస్ట్



**ఆర్మూర్ (సింగిడి) :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండలంలోని భట్టాపూర్ గ్రామ శివారులో గల వంతెనకు సమీపంలో పోలీసులు చాకచక్యంగా వల పన్ని గంజాయి విక్రయదారుల – సరఫరా చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు భీంగల్,సి.ఐ. సత్యనారాయణ, ఏర్గట్ల మండల ఎస్సై, పి.రాజేశ్వర్, మోర్తాడ్ మండల ఎస్సై. బి. రాము బుధవారం రోజు విలేకరుల సమావేశంలో తెలిపారు. భీంగల్ సీ.ఐ. ఎరుగట్ల మండల ఎస్సై, పి. రాజేశ్వర్, మోర్తాడ్ మండల ఎస్సై, బి. రాము తెలిపిన వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. పక్కా సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణా– గంజాయి నియంత్రణ లో భాగంగా బట్టాపూర్ గ్రామ శివారులో గల బ్రిడ్జికి అతి సమీపంలో ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేసినట్లు, పోలీస్ అధికారులు తెలిపారు. దీంతో స్కూటీపై ముగ్గురు వ్యక్తులు విచ్చేసారని, అనుమానం స్పదంగా కనిపించడంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందని భీమ్గల్ సీ.ఐ. సత్యనారాయణ, మోర్తాడ్, ఏరుగట్ల మండలాల ఎస్సైలు బి.రాము. పి. రాజేశ్వర్ లు తెలిపారు. దీంతో విచారణ చేపట్టగా ఆ ముగ్గురు వ్యక్తుల వద్ద 240 గ్రాముల ఎండు గంజాయి, 37 పాకెట్ల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. వారి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకోవడం జరిగిందని పోలీస్ అధికారులు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు మహారాష్ట్ర ప్రాంతంలోని నాందేడ్ జిల్లా నుండి గంజాయి విక్రయించేందుకు తీసుకువచ్చారని భీంగల్ సీఐ, ఏరుగట్ల, మోర్తాడ్ మండలాల ఎస్సైలు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు భీంగల్ సిఐ. సత్యనారాయణ, ఏరుగట్ల మండల ఎస్సై. పి. రాజేశ్వర్, మోర్తాడ్ మండల ఎస్సై, బి.రాము తెలిపారు. భీమ్గల్ సిఐ సత్యనారాయణ తో పాటు, ఏరుగట్ల మండల ఎస్సై, పి. రాజేశ్వర్, మోర్తాడ్ మండల ఎస్సై, బి. రాము, పోలీసులు సైతం చాకచక్యంగా వేధించడం వల్ల ఈ కేసును చేదించడం జరిగిందని పోలీసులు తెలిపారు.

## అందరూ ఉన్నా అనాథే... ఆకలితో అలమటిస్తున్న 85 ఏళ్ల వృద్ధుడు!

### మూడు రోజులుగా తిండిలేక అవస్థలు.. జానకంపేటలో చావుబతుకుల మధ్య చంద్రయ్య
### కుటుంబ సభ్యులకు చేర్చాలని గ్రామస్తులు, వృద్ధుడి వేడుకోలు



**ఆర్మూర్ (సింగిడి) :** చుట్టూ బంధువులు ఉన్నా ఆ వృద్ధుడికి ఆకలి తీర్చే నాథుడే కరువయ్యాడు. నడవలేని స్థితిలో, ఆకలి మంటలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ వృద్ధుడి కథనం నిజామాబాద్ జిల్లాలో తీవ్ర కలచివేస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని జానకంపేట గ్రామంలో 85 ఏళ్ల చంద్రయ్య (అలియాస్ రాజన్న) అనే వృద్ధుడు గత కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తూ పొట్ట నింపుకుంటున్నాడు. చంద్రయ్య స్వగ్రామం చందూరు. అతడికి వివాహం కాకపోవడం, తల్లిదండ్రుల ఆస్తిని అక్కలు తీసుకోవడంతో చివరికి ఒంటరివాడిగా మిగిలిపోయాడు. ఇన్నాళ్లూ అడుక్కుంటూ కాలాన్ని వెళ్లదీసిన చంద్రయ్యకు, ఇటీవల ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో కనీసం నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో స్థానిక పెద్దమనుషులు అతడిని గ్రామంలోని సొసైటీ ఆవరణలో ఉంచారు. గత మూడు రోజులుగా సరైన తిండి, నీళ్లు లేక ఆకలితో అలమటిస్తున్నానని ఆ వృద్ధుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. తనను ఎలాగైనా చందూరులోని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని వేడుకుంటున్నాడు. మా అక్క లచ్చవ్వ, ఆమె కొడుకు శంకర్, అలాగే చనిపోయిన మరో అక్క కమలవ్వ కొడుకులు సుదర్శన్, గోపాల్ అందరూ చందూరులోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉంటారు అని ఆ వృద్ధుడు పేర్కొంటున్నారు. వారి ఫోన్ నంబర్ (9708420177) కి ఫోన్ చేసినా ఎవరూ ఎత్తడం లేదని అధికారులు, పోలీసులు స్పందించి నన్ను నా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని కోరారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రయ్య పట్ల స్థానిక అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి, అతడిని చందూరులోని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని లేదా, సరైన ఆశ్రయం అధికారులు కల్పించాలని స్థానిక జాన్కంపేట గ్రామస్తులు కోరుతున్నారు.

## శిక్షణా తరగతులతో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది

### జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్






**నిజామాబాద్(సింగిడి) : :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులకు ఓరియంటేషన్ శిక్షణా తరగతులతో వృత్తి నైపుణ్యం పెరుగుతోందని, దీనివల్ల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. బుధవారం అధ్యాపకుల కు రెండవ స్పెల్ లో కామర్స్, ఫిజిక్స్, హిస్టరీ, జువాలజి సబ్జెక్ట్ శిక్షణ ముగింపు సందర్భంగా సభకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజు అధ్యక్షత వహించారు. నిజా మాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూని యర్ లెక్చరర్లకు జరుగుతున్న శిక్షణా తరగతులను డిఐఈవో తనిఖీ చేశారు. డిఐఈవో తిరుమలపుడి రవి కుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులు భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని సాంకేతికపరమైన పరిజ్ఞానంతో విద్యా బోధన చేసేందుకు శిక్షణ పొందడం, పేద విద్యార్థుల అభ్యున్నతికి నిదర్శమని అన్నారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థులను భావితరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి విద్యార్థి పైన వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ విద్యా బోధన చేయాలని ఆదేశించారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ రెండు రోజుల ఓరియంటేషన్ తరగతులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిస్తుందనిని అన్నారు. మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ లో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ కామర్స్ అధ్యాపకులు నారాయణ, శ్రీనివాస్, ఫిజిక్స్ ఫణికుమార్, నాగేశ్వరయ్య, జ్వాలాజి సుభాష్, శ్రీనివాస్, హిస్టరీ రవి కుమార్, దేవన్న లు అధ్యాపకులకు శిక్షణ, బోధనా మెళకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ ల సంఘం అధ్యక్షుడు చిన్నయ్య, అబ్జర్వర్ ధర్మపాల్, జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సయ్య తదిరులు పాల్గొన్నారు.

## సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి సీతారాం ఏచూరి

### సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు




**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** దేశంలో మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా, కమ్యూనిస్టు వ్యవస్థ నిర్మాణమే లక్ష్యంగా పనిచేసి దేశంలో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో బిజెపి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్న సందర్భంలో పార్లమెంట్లో కమ్యూనిస్టుల యొక్క గొప్పతనాన్ని, వారి పోరాట పటిమ చాటిన వ్యక్తి ఏచూరి అని, అదేవిధంగా అంతర్జాతీయంగా కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేయటంలో, సోషలిస్ట్ భాహుజాలాన్ని విస్తరింప చేయటంలో, అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ నాయకుల్లో ఒకరిగా ఆయన మన గలిగారని అన్నారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలు అలవాటు పడిన ఆయన విద్యార్థుల సమస్యలను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు పెట్టి వాటిని పరిష్కరించాలని నిలదీశారు అంతటి ధైర్యశాలి. దేశంలో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కొరకు, ఆయన ఆశయం కొరకు సిపిఎం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్ నగర కమిటీ సభ్యులు అనసూ యమ్మ, ఉద్దవ్, అనిత, నాయకులు అంజయ్య, రాజు, మాధవి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

### పోచమ్మ దేవాలయానికి విరాళం
## అందజేసిన చిలుక ఉపేందర్ రెడ్డి



**ఎల్బీ నగర్, (సింగిడి) :** కొత్తపేట డివిజన్ పరిధి లోని భారత్ నగర్ లో శ్రీ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ ఆహ్వాన పత్రికను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక ఉపేందర్ రెడ్డి కి కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సంద ర్భంగా కమిటీ సభ్యులకు దేవాలయ అభివృద్ధికి సహకరిస్తూ రూ. 51 వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రామచందర్, ఆకుల వెంకటేష్, మధుసూదన్, సత్యం, శ్రీనివాస్, బాలాజీ, మల్లేష్, శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఎలక్షన్ కమీషన్ కార్యక్రమాన్ని పార్టీ ఆదేశానుసారం దిగ్విజయం
## ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు
### టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి



**ఎల్బీ నగర్, (సింగిడి) ::** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఎన్యుమరేషన్, ఓటర్ల జాబితా పరిశీ లన కార్యక్ర మాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టాన ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవ ర్గంలో విజయ వంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సూచనలు, పార్టీ పిలుపు మేరకు గత 40 రోజులుగా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు నమోదు సవరణల ప్రక్రియ అత్యంత కీలకమైనదన్నారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా గ్రామ గ్రామాన, వార్డు వార్డునా పర్యటించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ఫారాలను సేకరించి సమర్పిం చడంలో మన కాంగ్రెస్ సైనికులు చూపిన చొరవ మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఐక్యతను, నిబద్ధతను చాటిచెప్పిందన్నారు. శ్రమించిన ప్రతి ఒక్కరికీ మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున, వ్యక్తిగతంగా నా తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

### బీసీ బాలుర వసతిగృహం వార్డెన్పై చర్యలు తీసుకోవాలని ఏబీసీడబ్ల్యూఓకి వినతి



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి) :** నిజామాబాద్ జిల్లాలోని చందూర్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులపై జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న వేధింపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయూవీ) నగర అధ్యక్షులు సుభాష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ని బిసి సంక్షేమ అధికారి కార్యాలయం లో ఏబీసీడబ్ల్యూఓ భాగ్యవతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ హాస్టల్లో విధులు నిర్వహిస్తున్న వార్డెన్ కల్పలత క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను కొట్టడం, మానసికంగా వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అలాగే వార్డెన్ భర్త కూడా హాస్టల్కు వచ్చి విద్యార్థులను బెదిరించడం, నిర్బంధించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, గౌరవం, హక్కులను దృష్టిలో ఉంచుకొని ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీసీడబ్ల్యూఓ భాగ్యవతిని కోరినట్లు తెలిపారు. హాస్టల్లో విద్యార్థులకు భయరహితమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సుభాష్ కోరారు. ఈ కార్యక్రమంలో నిశ్వాంత్, విజయ్, అనిల్, సచిన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం..!

**అవగాహనతోనే హెచ్ఐవీ-ఎయిడ్స్‌కు అడ్డుకట్ట: కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. జి. సుబ్బారావు**
**ఎయిడ్స్‌పై అపోహలను తొలగించి.. అవగాహనను పెంచాలి**
**విద్యార్థులు సమాజంలో చైతన్య దూతలుగా నిలవాలి: ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్**



**గోదావరిఖని (సింగిడి):** హెచ్ఐవీ--ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, సమాజంలో చైతన్యం తీసుకురా వాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. జి. సుబ్బారావు పిలుపునిచ్చారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం, హెల్త్‌కేర్ విభాగం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీటీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్ఐవీల-ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. అవగాహనతో తగ్గుతున్న హెచ్ఐవీ కేసులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీటీసీ విభాగ కౌన్సిలర్ శంకర్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ.. గతంలో హెచ్ఐవీ కేసులు అధికంగా ఉండేవని, ప్రభుత్వ చర్యలు, విస్తృతంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల కారణంగా ప్రస్తుతం కేసుల సంఖ్య గణనీయం గా తగ్గుతోందని తెలిపారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన అవసరం..**

జంతుశాస్త్రం, హెల్త్‌కేర్ విభాగాల అధిపతి డా. డి. కిరణ్మయి మాట్లాడుతూ హెచ్ఐవీ--ఎయిడ్స్ వ్యాధికి సంబంధించిన కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానాలపై ప్రతి విద్యార్థి పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాలను నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రజలకు సైతం వివరించి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. సవిత, అధ్యాపకులు డా. జి. శారద, పి. శ్రీదేవి, సుమలత, నివేదిత, స్రవంతి, సమత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హెల్త్‌కేర్ అధ్యాపకులు బి. ప్రసాద్ వందన సమర్పించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గంజాయి, సైబర్ నేరాలపై
# పోలీసుల ఉక్కుపాదం



**సీఐ పొన్నమనేని రంజిత్ రావు**

**సుల్తానాబాద్, (సింగిడి):** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం బురమి యా పేట్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సమాజ అవగాహన సదస్సు నిర్వహించారు. సుల్తానా బాద్ సీఐ పి. రంజిత్‌రావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎలిగేడు ఎస్‌హెచ్ఓ ఎల్. మధు కర్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నా రు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూ రంగా ఉండాలని, వాటి విక్రయం, వినియోగంపై సమాచారం అందిం చాలని సీఐ సూచించారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, OTP, PIN, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దని ఎస్ హెచ్ఓ మధుకర్ హెచ్చరించారు. సైబర్ మోసా నికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వా లని తెలిపారు. అలాగే హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్ప నిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహ నాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి వాటికి దూరంగా ఉండాల ని సూచించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలా పాలపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమా చారం అందించాలని కోరారు. ప్రజల సహకారం తోనే నేర రహిత, గంజాయి రహిత సమాజాన్ని నిర్మించగలమని సీఐ రంజిత్‌రావు పేర్కొన్నారు.

## లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**చింతలమానేపల్లి (సింగిడి):** మండలంలోని బాబాసాగర్, గూడెం, బాలాజీ అనుకోడ, చింతలమానేపల్లి, కర్జెల్లి తదితర గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 2.15 లక్షల విలువైన చెక్కులను మంగళవారం బీజేపీ మండల నాయకులు పంపిణీ చేశారు. సిర్పూర్ (టి )ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా కొంత ఊరటనిస్తోందని, బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అండగా ఉంటున్నారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు ఎలుమల మల్లయ్య, దుబ్బుల మురళి, కత్తెర్ల మల్లయ్య, సత్పుతే తుకారం, చౌదరి నానయ్య, పవన్ పురోహిత్, మోహన్, రామస్వామి, దందరే పోశన్న, జాడి తిరుపతి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# వర్షం పడితే.. మార్కెట్‌లో వరదే!

**మంచిర్యాల, (సింగిడి):** వర్షం వస్తే చాలు.. మంచిర్యాల ప్రధాన కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల గుండెల్లో గుబులు మొదలవు తోంది. మార్కెట్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపో వడంతో చిన్నపాటి వర్షానికే నీరు పొంగిపొర్లు తోంది. కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు, కొనుగోలుకు వచ్చే ప్రజలు మురుగు నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంటోంది. నీరు నిలిచిపోవ డంతో కూరగాయలు తడిసి నాణ్యత దెబ్బతినే పరిస్థితి కూడా ఏర్పడుతోందని వ్యాపా రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ గురువారం ప్రధాన కూం గాయల మార్కె ట్‌ను సందర్శించారు. కూరగాయల మార్కెట్ సం ఘం నాయకులతో కలిసి మార్కెట్ అంతా పరిశీ లించారు. వర్షం కురిసినప్పు డు నీరు ఎక్కడి నుంచి వస్తోంది.. ఎక్కడ నిలిచిపోతోం ది.. డ్రైనేజీ వ్యవస్థలో ఎక్కడ లోపం ఉంది.. అనే అంశాలను పరిశీలిం చారు.

**వ్యాపారుల గోడు విన్న మేయర్..**

మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న వారితో మేయర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ప్రతిరోజూ కూరగాయల విక్ర యాలపై ఆధారపడి జీవించే తమకు వర్షాకాలంలో నీటి సమస్య తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వ్యాపారులు వివరించారు. వర్షపు నీటితో పాటు మురుగు నీరు మార్కెట్‌లోకి చేరడం తో వ్యాపార నిర్వహణ కష్టంగా మారుతోందని తెలిపారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే సామాన్య ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నా రని, మార్కెట్‌లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడా ల్సిన అవసరం ఉందని వారు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు.



**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..**

వ్యాపారుల సమస్యలను ఓపికగా విన్న మేయర్ దర్ని మధుకర్.. సమస్యను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. మార్కెట్ కేవలం వ్యాపార కేంద్రం మాత్రమే కాదని.. వంద లాది మంది వ్యాపారులు, కార్మికులు, కొనుగోలు దారుల జీవనాధారంతో ముడిపడి ఉందని, వారి ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉందని మేయర్ పేర్కొన్నారు.

# చిన్నారుల భవిష్యత్‌కు గ్రామస్థుల భరోసా

**మానవత్వానికి మచ్చుతునక..**
**ఆపదలో కుటుంబానికి అండగా కనుకుల గ్రామం**

**సుల్తానాబాద్, (సింగిడి):** కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ముత్యాల రా జుమోహన్ మృతి చెందడంతో చిన్నారులు దిక్కు లేని పరిస్థితుల్లో పడకుండా సుల్తానాబాద్ మం డలం కనుకుల గ్రామస్థులు మానవత్వాన్ని చాటు కున్నారు. రాజుమోహన్‌కు చిన్నపిల్లలు ఉండటం తో వారి భవిష్యత్‌కు భరోసా కల్పించాలనే ఉద్దే శంతో గ్రామస్థులు ముందుకొచ్చారు. చిన్నారుల పేర్లపై రూ. లక్ష మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్ డీ) చేయాలని నిర్ణయించి, ఆ మొత్తం భవిష్యత్ లో వారి అవసరాలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేశారు. కష్ట కాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచి, చిన్నారుల భవిష్యత్‌పై భరోసా కల్పించిన గ్రామస్థుల ఔదార్యాన్ని పలువురు అభినందించా రు. ఆపదలో తోడుగా నిలవడమే నిజమైన మా నవత్వమని కనుకుల గ్రామస్థులు తమ సేవాభా వంతో చాటిచెప్పారు.



# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

**తాహసిల్దార్ కు వినతిపత్రం అందజేత**

**కొమురం భీం ఆసిఫాబాద్ (సింగిడి):** పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోయం ఇందు రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా కౌటాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ప్రమోద్ కు వినతిపత్రం అందజేశారు. పీఆర్సీ కాలపరిమితి ముగిసి 36 నెలలు గడిచినా ఇప్పటివరకు పీఆర్సీని ప్రకటించకపోవడం బాధాకర మన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, వివిధ రకాల పెండింగ్ బిల్లులు, జీపీఎఫ్ రుణాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయడంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఈ నెల 19న జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహిస్తామని, అలాగే ఈ నెల 29న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వినోద్, గుణాకర్ చౌదరి, రవికుమార్, చిలుకయ్య, రాథోడ్ కృష్ణ, రావుజి, సంతోష్, గంగా సింగ్, చంద్రమౌళి, విలాస్, భగవాన్, తిరుపతి, అవినాష్, కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ముువ్వన్నెల జెండా నీడలో.. అమరవీరుల త్యాగాల జ్ఞాపకం

**500 మీటర్ల జాతీయ జెండాతో తిరంగ ర్యాలీ.. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**



**మంచిర్యాల, (సింగిడి):** స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్న వేళ.. మువ్వన్నెల జెండా కేవలం జాతీయ చిహ్నంగా కాకుండా, ఎన్నో త్యాగాల జ్ఞాపకంగా నిలుస్తోంది. స్వేచ్ఛగా ఊపిరి పీలుస్తున్న ప్రతి భారతీయుడి వెనుక ఎందరో అమరవీరుల త్యాగం దాగి ఉంది. ఆ త్యాగాలను నేటి తరానికి గుర్తుచేస్తూ మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన తిరంగ ర్యాలీ దేశభక్తి భావాన్ని చాటింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలు.. అడుగుల్లో ఉత్సాహం.. నోట దేశభక్తి నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. సుమారు 500 మీటర్ల భారీ జాతీయ జెండాను విద్యార్థులు ప్రదర్శించడం ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాలేదని, దాని వెనుక ఎన్నో దశాబ్దాల పోరాటం, వేలాది మంది త్యాగాలు ఉన్నాయని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు తమ కుటుంబాలను, ఆస్తులను, చివరకు ప్రాణాలను సైతం దేశం కోసం అర్పించారని గుర్తుచేశారు. నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తూ విద్య, ఉపాధి, వ్యాపారం, భావ వ్యక్తీకరణ వంటి హక్కులను అనుభవిస్తున్నామంటే.. వాటి వెనుక అమరవీరుల పోరాటం ఉందనే విషయాన్ని యువత గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య వేడుకలు కేవలం ఆర్భాటంగా కాకుండా.. దేశ చరిత్రను తెలుసుకునే సందర్భంగా మారాలని సూచించారు.

**సరిహద్దుల్లో సైనికుల త్యాగం**

స్వాతంత్ర్యం సాధించిన వారిని స్మరించుకోవడంతో పాటు.. నేటి స్వేచ్ఛను కాపాడుతున్న సైనికుల సేవలను కూడా గుర్తించాలని పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా, ఎండా వానలను లెక్కచేయకుండా సరిహద్దుల్లో సైనికులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. దేశ ప్రజలు ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో సరిహద్దుల్లో సైనికులు అప్రమత్తంగా ఉంటారని.. వారి త్యాగం వల్లే దేశ భద్రత సాధ్యమవుతోందని చెప్పారు. ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమర సైనికులను, వారి కుటుంబాలను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. 2047 నాటికి భారత్‌ను వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ లక్ష్యం కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదని.. ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రత్యేకంగా విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. విద్యతోపాటు క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావం, దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. యువత తమ ప్రతిభను దేశ ప్రగతికి వినియోగిస్తే ప్రపంచంలో భారత్‌ను అగ్రగామి దేశంగా నిలపడం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పెద్దపల్లి పురుషోత్తం, పాల్గొన్నారు.

# యువత ఉత్సాహం చూస్తుంటే భారత్ విశ్వ గురువుగా మారడం ఖాయం





**ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**
**'భారత్ మాతాకీ జై' తో మార్మోగిన నిర్మల్.. ఘనంగా తిరంగా ర్యాలీ**

**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, దేశం, ధర్మం కోసం యువత తమ సమయాన్ని కేటాయించాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువకులు, దేశభక్తులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తిని చాటారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో నిర్మల్ పట్టణం మార్మోగింది. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, అంబేద్కర్ చౌక్, పాత బస్టాండ్ మీదుగా వివేక్ చౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ర్యాలీలో యువత చూపిన ఉత్సాహం చూస్తుంటే భారతదేశం ప్రపంచంలోనే విశ్వగురుగా అవతరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. 'వందేమాతరం' గీతాన్ని దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఆలపించేలా ప్రధాని నరేంద్ర మోదీ చట్టబద్ధత కల్పించారని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేంద్రంలోని మోదీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించి యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, స్రవంతి రెడ్డి, తక్కల రమణ రెడ్డి, కరిపే విలాస్, మెడిసెమ్మ రాజు, రాజేశ్వర్ రెడ్డి, దీజీవీ జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు , పట్టణ బీజేపీ కౌన్సిలర్లు, విద్యార్థులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలి

**మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్**



**మంచిర్యాల, (సింగిడి):** ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, చట్టపరిధిలో వేగంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం అందించాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పోలీసు అధికా రులను ఆదేశించారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్‌లోని విధులు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీ ముందుగా స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడకు వివిధ సమస్యల పై వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తి సమస్యను సానుభూతితో వినాలని, ఫిర్యాదు స్వీకరించిన వెంటనే దాని స్వభావాన్ని బట్టి చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఫిర్యాదుదారులను అనవసరంగా తిప్పించకుండా, వారికి కేసు దర్యాప్తు పురోగతిపై అవసరమైన సమాచారం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**రికార్డుల నిర్వహణపై ఆరా**

అనంతరం స్వీకరణ కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుల నమోదు, వాటిపై తీసుకున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాలు తదితర వివరాలను పరిశీలిస్తూ రికార్డుల నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించు కోవాలని, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.

**అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలి..**

స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను డీసీపీ అడిగి తెలుసుకున్నారు. వారికి కేటాయించిన విధులు, ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై సేకరిస్తున్న సమాచారం గురించి ఎస్ఐ, సీఐ రవీందర్‌ను ప్రశ్నించారు. సమస్యాత్మక ప్రాంతాలు, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తుల కదలికలపై సమాచారం సేకరించి ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పోలీసింగ్ కొనసాగించాలని స్పష్టం చేశారు.

**సిబ్బంది సమస్యలు తెలుసుకున్న డీసీపీ..**

తనిఖీలో భాగంగా పోలీస్ సిబ్బందితో డీసీపీ నేరుగా మాట్లాడారు. విధుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై వారి నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటేనే పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు.

# క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

**మంచిర్యాల, (సింగిడి):** ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకోవాలని మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ మధుకర్ పేర్కొన్నారు. మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడా సౌకర్యాలు కల్పించి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ/ఏటీసీ ప్రిన్సిపాల్, తెలంగాణ ఎన్జీవోస్ యూనియన్ నాయకులు శ్రీహరి, శ్రావణ్ కుమార్, గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు కె. వనజ రెడ్డి, సుధాకర్, సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# లేఅవుట్లలో రోడ్ల విస్తీర్ణం, హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
### మున్సిపల్ కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలు



**నాగర్ కర్నూల్ (సింగిడి):** నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ప్లాట్ల లేఅవుట్లపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సందర్శించారు. పట్టణ విస్తరణ వేగంగా జరుగు తున్న నేపథ్యంలో ప్రైవేటు లేఅవుట్లు ,పట్టణాభివృద్ధి క్రమబద్ధంగా సాగేందుకు, ప్రజలకు భవిష్యత్తులో రహదారులు, మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కలెక్టర్ ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా, జిల్లా ఎస్పీ ఎదురుగా, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైవేటు లేఅవుట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, లేఅవుట్ల ఏర్పాటు ప్రభుత్వ నిబంధనలు, మున్సిపల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా లేదా అనే అంశాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్లలో ప్లాట్ల విభజన, రహదారుల ఏర్పాటు, రోడ్లకు కేటాయించిన స్థలం, లేఅవుట్ హద్దులు, ఇతర మౌలిక సదుపాయాలకు కేటాయించిన ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. లేఅవుట్ అభివృద్ధి సమయంలో నిబంధనలకు అనుగుణంగా స్థలాలను కేటాయించారా, రహదారుల విస్తీర్ణం నిర్ణీత ప్రమాణాల మేరకు ఉందా, లేఅవుట్ హద్దులు సక్రమంగా నిర్ధారించారా అనే విషయాలపై లేఅవుట్ ల పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు లేఅవుట్ల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకే జరగాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లేఅవుట్లలో రహదారులు, ప్రజా అవసరాలకు కేటాయించే స్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిర్దేశించిన ప్రదేశాలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత నిర్వాహకులపై ఉందన్నారు. ప్రైవేటు లేఅవుట్ల విషయంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు చేయకుండా ముందస్తు పర్యవేక్షణ చేపటాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన లేఅవుట్లను కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు. లేఅవుట్లలో రహదారుల విస్తీర్ణం అత్యంత కీలకమైన అంశమని, భవిష్యత్తులో జనాభా పెరుగుదల, వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రహదారుల వెడల్పు, హద్దులు నిబంధనల మేరకు ఉండేలా చూడాలని, రహదారులకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా లేఅవుట్ల హద్దులు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు, రహదారులు లేదా ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. లేఅవుట్లను అనుమతించే సమయంలోనే అన్ని నిబంధనలను కచ్చితంగా పరిశీలించాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, లేఅవుట్లకు సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలుపై అధికారులు స్పష్టమైన పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళికకు అనుగుణంగా అభివృద్ధి జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్ల విషయంలో ఎలాంటి అవకతవకలకు, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రైవేటు లేఅవుట్లను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులను గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్లకు సంబంధించిన రికార్డులు, అనుమతులు, స్థల వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు లేఅవుట్లకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి ప్రాధాన్యత క్రమంలో కార్యక్రమాలు అమలు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల బ్యూరో (సింగిడి):** గ్రామాల అవసరాలకు అనుగుణంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు 2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, ఆరోగ్యవంతమైన గ్రామాలు, బాలలకు అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య,తాగునీటి సౌకర్యం,పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు,సామాజిక న్యాయం,సుపరిపాలన,మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక,ఆర్థిక ప్రగతి,అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను ప్రాధాన్యతగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.అన్ని శాఖల పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు, నిధులు,వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలవాలని అన్నారు.ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, డీఆర్డీఓ ముషాయిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, డీడబ్లుఓ సునంద, డియంహెచ్ఓ సంధ్య కిరణ్మయి,మత్స్య శాఖ అధికారి షకీలా భాను, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలి

### పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్





**కల్వకుర్తి (సింగిడి):** ఇబ్రహీం పట్నం నియోజక వర్గంలోని మంచాల మండలం ఆరుట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మరియు కమిషన్ సభ్యులు శారద, ఆనంద్, భారతి తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ఆకస్మి కంగా తనిఖీ నిర్వహించారు. చైర్మన్,సభ్యులు ఉదయం విద్యార్థులకు అందిస్తున్న బ్రేక్ ఫాస్ట్‌ను స్వయంగా రుచి చూసి,ఆహార నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం మిల్లెట్ ఇడ్లీ,రాగి జావ అందించాల్సి ఉండగా, జీరా రైస్ అందించడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సమస్య కారణంగా టిఫిన్ అందించలేకపోయామని ప్రిన్సిపాల్, మెస్ ఇన్‌ఛార్జ్ వివరించారు. అయితే కారణాలు చెప్పకుండా నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాల్సిన బాధ్యత ఉందని చైర్మన్ స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడగా, మెనూ ప్రకా రం ఆహారం అందడం లేదని, తరచూ అన్నం మాత్రమే పెడుతున్నారని, టిఫిన్ సరిగా అందడం లేదని తెలిపారు. కిచెన్, డైనింగ్ హాల్ మరియు ఫుడ్ స్టోరేజీని పరిశీలించగా పాడైన కూరగాయలు,నాణ్యత లేని బియ్యం నిల్వలు గుర్తించారు. స్టోరేజ్ రూమ్‌లో కొన్ని సామగ్రిని నేలపై ఉంచినట్లు గుర్తించారు. మెనూ బోర్డు, కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయకపోవడం కూడా గుర్తించారు. సివిల్ సప్లై అధికారు లకు నాణ్య మైన బియ్యం అందించాలని అదేసించారు. తరచు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయిం చాలని ఆదేశించారు. విద్యార్థులకు నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం తప్పనిసరి అని చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల ఆహార విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. అనంతరం ప్రిన్సిపాల్, హెడ్ మాస్టర్లు, స్కూల్ కమిటీ సభ్యులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన స్కూల్ కమిటీ సమావేశాల్లో ఫుడ్ కమిషన్ ఆర్డర్, విద్యార్థుల ఆరోగ్య ప్రొఫైల్ అంశాలను అజెండాలో చేర్చకపోవడం కమిషన్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత మరియు మెనూ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భవిష్యత్తులో ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషన్ బృందం ఆదేశించింది.

# ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ

### ఇద్దరు మహిళల దుర్మరణం..
### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
### గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
### సంఘటన స్థలానికి పరిశీలించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** జాతీయ రహదారిపై టైర్ పంక్చర్ అయి ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆర్మూర్ మండల పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి దర్శనం కోసం రెండు టూరిస్ట్ బస్సుల్లో తీర్థయాత్రకు బయలుదేరారు. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపానికి చేరుకున్న సమయంలో ముందుగా వెళ్తున్న టూరిస్ట్ బస్సు టీజీ 01 టీ 1864 టైర్ పంక్చర్ కావడంతో రెండు టీజీ 21 టీ 2172 బస్సులను జాతీయ రహదారిపై నిలిపివేశారు. టైర్ పంచర్ కావడంతో బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందికి దిగి, రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ టీజీ 27 టీఎఫ్ 7482 డ్రైవర్ ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును సకాలంలో గుర్తించకపోవడంతో బస్సును బలంగా ఢీకొట్టాడు. లారీ ఢీకొట్టడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సు ముందుకు కదిలి డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుజాత (54), మాధవి (47) అనే ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ప్రయాణికులు సునీత, చిటక్కలకు తీవ్రంగా గాయపడటంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న ఇతర ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా,పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్**

ప్రమాదం ఘటన సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాహనాలు ఏ విధంగా నిలిపి ఉన్నాయనే అంశాలతో పాటు లారీ ఢీకొన్న తీరును అధికారులు సీపీకి వివరించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన విధానం తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. సీపీ వెంట ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ, ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్ కుమార్, ఆర్మూర్, జక్రాన్ పల్లి, బాల్కొండ ఎస్సైలు, అసిస్టెంట్ ఎం.వి.ఐ పాల్గొన్నారు.

# ఆవేశంలో రైలు పట్టాలెక్కిన వ్యక్తి...

### సకాలంలో స్పందించిన పోలీసులు



**నారాయణపేట ప్రతినిధి,(సింగిడి):** కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన ఒక వ్యక్తిని మక్తల్ పోలీసులు చాకచక్యంగా కాపాడారు. సమయస్ఫూర్తితో స్పందించి ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టిన పోలీసుల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. లిఅసలేం జరిగింది?లి వివరాల్లోకి వెళితే...నారాయణపేట జిల్లా జక్లేరు గ్రామానికి చెందిన నరసింహ అనే వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి తన భార్య మంగమ్మకు ఫోన్ చేసి, తాను చనిపోతున్నానని చెప్తూ రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. ఆందోళన చెందిన భార్య వెంటనే రాత్రి 11 గంటల సమయంలో మక్తల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆవేదనతో సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలి నుంచి సమాచారం అందుకున్న మక్తల్ ఎస్ఐ రాజు తక్షణమే స్పందించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న బ్లూకోల్ట్, పెట్రోలింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సి-693 బలరాం, పిసి-763 హరీష్ గౌడ్, పిసి-2501 నరేష్, హెచ్‌జి-150 శ్రీనివాస్. ఎస్ఐ ఆదేశాలతో అప్రమత్తమైన పోలీస్ బృందం ఆలస్యం చేయకుండా జక్లేర్ గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే చీకట్లో రైల్వే ట్రాక్‌పై ఉన్న నరసింహను పోలీసులు గుర్తించారు. అతనికి నచ్చజెప్పి, ఆవేశంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ధైర్యం చెప్పారు. అనంతరం అతడిని సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చి, భద్రంగా ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయానికి స్పందించి తమ నరసింహ ప్రాణాలు కాపాడిన మక్తల్ పోలీసులకు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. రాత్రి వేళలోనూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రాణాపాయం తప్పించిన సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు సైతం ప్రత్యేకంగా అభినందించారు.

# కొత్తగూడెం కార్పొరేషన్‌ను చిదిమేయకండి: ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, (సింగిడి):** కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం కార్పొ రేషన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయంలో అనవసర ఆరోపణలు, తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో అనుమానాలు సృష్టించవద్దని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా రూ. 600 కోట్ల నిధులు సాధించే దిశగా చర్యలు చేపట్టామని, డీపీఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తామని తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు సమకూరనున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకంలో కేంద్ర సహాయం, రాష్ట్రవాటా, బ్యాంకు రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని వివరించారు. ఖమ్మం కార్పొరేషన్‌కు సుమారు రూ. 2,670 కోట్ల రుణం వచ్చే అవకాశం ఉండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ. 600 కోట్ల రుణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.

**రూ. 9.60 కోట్ల అవినీతి ఆరోపణలు అబద్ధం**

రూ. 600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డీపీఆర్ తయారీ టెండర్ ఒప్పందం జరిగితే రూ. 9.60 కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేయడం అవగాహన లేమికి నిదర్శనమని కూనంనేని విమర్శించారు. రాష్ట్రంలోని నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ. 1,000 కోట్ల పనులకు 1.5 శాతం చొప్పున డీపీఆర్ ఒప్పందాలు జరిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇతర పట్టణాల్లో ఇదే విధానం అమలవుతున్నప్పుడు కొత్తగూడెంలోనే అవినీతి జరిగిందని ఆరోపించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. "ఆరు నెలల పసికందులాంటి కొత్తగూడెం కార్పొరేషన్‌ను పురిటిలోనే చిదిమేయకండి" అని అన్నారు.

**ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు**

ప్రజల్లో ఉన్న అనుమానాలు, అపోహలను నివృత్తి చేసేందుకే ఆఫ్‌లైన్ డీపీఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 0.5 శాతం లేదా అంతకంటే తక్కువకు డీపీఆర్ పనులు చేపట్టే సామర్థ్యం ఉన్నవారు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉంటుందని చెప్పారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లుగా సీపీఐ ఆధీనంలో ఉందని, ప్రజాదరణ లేకపోతే తాము ఎన్నికల్లో గెలిచేవాళ్లమా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణాల విధానాన్ని తాము వ్యతిరేకించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని కూనంనేని హెచ్చరించారు. అయితే ఆధారాలు లేకుండా అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని సూచించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పేర్ల మార్పు సమస్యను వెంటనే పరిష్కరించాలి



**కొత్తగూడెం, (సింగిడి):** సింగరేణి కార్మికుల కుటుంబాలకు సంబంధించిన పేర్ల మార్పు సమస్యను వెంటనే పరిష్కరించాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా విజిలెన్స్ విచారణ పేరుతో సమస్య పెండింగ్‌లో ఉండటంతో సుమారు 400 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన అన్నారు. స్థానిక హెడ్ ఆఫీస్ ఎదుట బాధితులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన శివకుమార్, దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని సింగరేణి యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుండా రమేష్, పి. సురేందర్, భూపతి అశోక్, మచ్చా పృథ్వీరాజ్, ఎనిగంట శ్రీనివాస్, అన్వర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ... సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** ఐఎంఎల్ డిపో హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాక్లూర్ మండల తహసీల్దార్‌కు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీ కార్మికుల కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, హెల్త్ కార్డులు అందజేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులు, సివిల్ సప్లైస్, రైస్ మిల్లులు, దాల్ మిల్లులు, గిడ్డంగులు, వ్యాపార సంస్థలు, బజారు ముఠాలు, కోల్డ్ స్టోరేజీలు, కూరగాయలు--పండ్ల మార్కెట్లు, రైల్వే, సిమెంట్, స్టీల్ తదితర రంగాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా హమాలీల కూలీ రేట్లు పెరగలేదని, పని భద్రత, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, సంక్షేమ సౌకర్యాలు లేక వేలాది మంది హమాలీ కార్మికులు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొండ గంగాధర్ మాట్లాడుతూ, ఐఎంఎల్ డిపో కార్మికుల్లో 50 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు నెలకు రూ. 6,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని, కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు రమేష్, లక్ష్మణ్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం ఏదీ?

### మిక్స్డ్ వెజిటబుల్ కర్రీ,
### వెజిటేబుల్ బిర్యానీ ఇవ్వాల్సి ఉండగా..
### తెల్ల అన్నం, అనపకాయ కూర వడ్డింపు




**నాగర్ కర్నూల్ (సింగిడి):** నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిం చాల్సి ఉండగా, అందుకు భిన్నంగా తిమ్మాజిపేట మం డలం మారేపల్లి ప్రాథమిక పాఠశాలలో భోజనం వడ్డిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారంగా గురు వారం విద్యార్థులకు మిక్స్ వెజిటబుల్ కర్రీ, వెజిటేబుల్ బిర్యానీ అందించాల్సి ఉండగా.. పాఠశాలలో మాత్రం తెల్ల అన్నం, అనపకాయ కూర మాత్రమే వండి వడ్డిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత పాఠశాల సిబ్బందిపై ఉన్నప్పటికీ, మెనూకు విరు ద్ధంగా భోజ నం అందించడంపై విద్యార్థులు, తల్లిదం డ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో మెనూ పాటిస్తున్నారా? లేదా? అనే అంశంపై అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. మెనూ అమలుపై అధికారులు దృష్టి సారించి, విద్యార్థులకు ప్రతిరోజూ నిర్దేశిత మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు విడుదల చేయాలి

### ఖాళీగా ఉన్న జూనియర్ కళాశాల లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలి
### విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్



**ఖమ్మం, (సింగిడి):** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను వేలాది మంది విద్యార్థులతో ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ. వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. విద్యార్థుల హక్కుగా అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్లను భిక్షగా చూడొద్దని, తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనేక సబ్జెక్టులకు లెక్చరర్లు లేక విద్యార్థు లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అసెంబ్లీలో ప్రకటించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల మధ్యాహ్న భోజన పథకాన్ని మాటలకే పరిమితం చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని బీపీఈడీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ తెల్లవారుజామున మూడు కిలోమీటర్ల మేర నడిచి గ్రౌండ్‌కు రావాల్సి వస్తోందని ప్రవీణ్ తెలిపారు. కళాశాలకు అనుబంధంగా బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కొరత ఉందని, వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం దురదృష్టకరమని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మం త్రులు విద్యారంగ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో జిల్లాలో మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాత్విక, జిల్లా ఉపాధ్యక్షులు దొంతబోయిన వెంకటేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షులు రెడ్డిపోగుల త్రినాథ్, జిల్లా కమిటీ సభ్యులు భాను, శ్రీకర్, ఎస్ఆర్ఎన్ బీజీఎన్ఆర్ కళాశాల కార్యదర్శి శ్యామ్, నాయకులు లోకేష్, భరత్, గోపీచంద్, సత్యారాం, సంజు, రాగిణి, పూజిత, త్రివేణి, సింధు, భువనకీర్తి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్,టై, బెల్ట్, పంపిణీ చేసిన సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలం పడకల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వము నుండి వచ్చిన యూనిఫామ్,టై, బెల్ట్, షూ, విద్యార్థిని విద్యార్థులకు అందజేసిన గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో నిరుపేద విద్యార్థులు చదువుకుంటారు వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ నాణ్యత మైన దుస్తులు అందించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల బలోపేతం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు అని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, గ్రామ ఉపసర్పంచ్, రాఘవేందర్ ,వార్డు సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



# ధర్మపురి అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

## రూ.117 కోట్ల పుష్కర నిధుల్లో రూ.37 కోట్లు ధర్మపురికే: మంత్రి లక్ష్మణ్‌కుమార్



**ధర్మపురి (సింగిడి):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధర్మపురి క్షేత్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలతో ధర్మపురి క్షేత్రం రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని తెలిపారు. గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.
గురువారం ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో అంబేద్కర్ భవన నిర్మాణ పనులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో పట్టణంలోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నామని తెలిపారు.

**విద్యార్థులకు ఉపయోగపడేలా భవనం**
ధర్మపురిలో నిర్మిస్తున్న అంబేద్కర్ భవనం భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తెలిపారు. భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, తద్వారా వచ్చే ఆదాయాన్ని భవనం నిర్వహణకు ఉపయోగించుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. మరో రెండు అంతస్తుల్లో విద్యార్థుల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు.

**రూ. 37 కోట్లతో పుష్కర పనులు**
ధర్మపురి క్షేత్ర అభివృద్ధిని ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యంతో చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 117 కోట్లు కేటాయించిందని, అందులో ధర్మపురి క్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 37 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు క్షేత్ర అభివృద్ధికి అవసరమైన శాశ్వత పనులను చేపడుతున్నట్లు చెప్పారు.

**మరిన్ని నిధులతో అభివృద్ధి**
పుష్కరాల నిధులతో పాటు టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 15 కోట్ల నిధులు సమకూర్చి ధర్మపురిలో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని మంత్రి వెల్లడించారు. అమృత్ పథకం ద్వారా కూడా అదనపు నిధులు సాధించి పట్టణంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యాలు, పట్టణ అభివృద్ధి, క్షేత్ర ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

**భక్తులకు మెరుగైన సౌకర్యాలు**
ధర్మపురి క్షేత్రానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ధర్మపురిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని, రాబోయే రోజుల్లో వీటి ఫలితంగా ధర్మపురి పట్టణంతో పాటు క్షేత్రం రూపురేఖలు గణనీయంగా మారనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల యువ సమ్మేళనం

## దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి: ఆర్ఎస్ఎస్ వక్తలు



**కరీంనగర్, (సింగిడి):** ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తపల్లిలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యువ సమ్మేళనం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భాను చందర్, తడగొప్పుల శంకరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాది అని, క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావంతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు సమయపాలన, నాయకత్వ లక్షణాలు, ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే ఆందోళనలు ప్రజాస్వామ్య నిబంధనల పరిధిలోనే జరగాలని అన్నారు. ఇటీవల యువత చేపట్టిన ఆందోళనలను ఆసరాగా చేసుకుని దేశ వ్యతిరేక శక్తులు అలజడులు సృష్టించే అవకాశం ఉన్నందున యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సమాజమంతా ఒక్కటేననే భావనను యువత పెంపొందించుకోవాలని, యోగా, వ్యాయామం, బౌద్ధిక చర్చలను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ, రక్తదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, దేశ నిర్మాణాత్మక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో యువ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్, సహకార్యవాహ మురళి, రమణ, కన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

# కోరపల్లి పాఠశాలలో బోనాల వేడుకలు



**జమ్మికుంట, (సింగిడి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలిసే విధంగా జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోనాల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల వేషాలతో పాటు అమ్మ వారి అలంకరణలతో బోనాల నెత్తిన పెట్టుకొని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకొని పెద్దలను గౌరవించడంతోపాటు ఆ పండగలను భవిష్యత్తులో అత్యంత ఘనంగా జరపాలనే ఉద్దేశంతో పాఠ్య పుస్తకాలతో సమానంగా సంస్కృతి గురించి కూడా బోధించడం జరుగుతుందని వెల్లడించారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాబోధన కొనసాగించాలి

## అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, (సింగిడి):** విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశం చారు. గురువారం ముక్రాంపురంలోని ఓల్డ్ హైస్కూల్ ప్రాంగణంలోని సమీకృత బాలుర వసతి గృహాన్ని, డాక్టర్ స్ట్రీట్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆమె పరిశీలిం చారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో లీకేజీలు, వంటశాల షెడ్డు, తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించిన సమస్యలను గుర్తించిన కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. విద్యార్థులకు అనుకూ లమైన వాతావరణం కల్పించేలా అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు పాఠశాల విద్యార్థులను ముక్రాంపురంలోని సమీకృత బాలుర వసతి గృహానికి తరలించి, అక్కడే వసతి, భోజనం, తరగతుల నిర్వహణ కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, భోజనం తదితర సౌకర్యాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మరమ్మతులు పూర్తైన వెంటనే విద్యార్థులను తిరిగి పాఠశాలకు తరలించాలని ఆదేశం చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్తలు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు కూడా ఇవ్వాల్సిందే..!

## బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి



**జమ్మికుంట, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన 420 హామీలలో భాగంగా వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లను కూడా వెంటనే అమలు చేయాలని ఇల్లందకుంట మండల బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గత ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పెన్షన్లను పెంచి ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ రెండున్నరేళ్లు గడిచినా పెన్షన్ల పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా ప్రజలను మభ్యపెడుతోం దని పవన్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయమని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకటించిన నేపథ్యంలో మీ–సేవ కేంద్రాలకు వెళ్లిన వృద్ధులు, బీడీ కార్మికులకు సంబంధించి దరఖాస్తు చేసుకునే ఆప్షన్ సైట్‌లో కనిపించడం లేదని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లో కూడా వృద్ధాప్య, బీడీ కార్మికుల వివరాల నమోదు కోసం ప్రత్యేకంగా ఎలాంటి కాలమ్ లేకపోవడం అనుమానా లకు తావిస్తోంద న్నారు. వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారా? లేదా? సైట్‌లో ఆప్షన్ కనిపించ కపోవడానికి ఏమైనా సాంకేతిక సమస్య ఉందా? అనే విషయా లపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని మట్ట పవన్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే ఆగస్టు 15 నుంచి పెన్షన్లను పెంచి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, వృద్ధులు, బీడీ కార్మికులకు కూడా పెంచిన పెన్షన్‌ను అందించాలని కోరారు. హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు తగవు.. కౌశిక్‌రెడ్డికి అండగా మేమున్నాం..

## నిజాలు మాట్లాడితే విమర్శించడం సరికాదు: మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట, (సింగిడి):** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యక్తిగత విమర్శ చేయ డం సరైన పద్ధతి కాదని నిజాలు మాట్లాడితే దుష్ప్రచారాలు చేయడం దిక్కుమాలిన చర్య అని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ వైస్ చైర్మన్ అన్నారు. గురువారం జమ్మికుంటలో ఏర్పాటు చేస్తే మీడియా సమా వేశంలో వారు మాట్లాడుతూ, కమలాపూర్‌లో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వా మ్య విలువలకు విరుద్ధమని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ సంయుక్తంగా ఖండిం చారు. కమలాపూర్ సభలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిం దనే వాస్తవాన్ని మాత్రమే ప్రస్తావించారని తెలిపారు. అదేవిధంగా కమలాపూర్‌లో ఉప్పల్ మండలంగా ప్రకటించాలని ప్రజల తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ అంశాలను వక్రీకరించి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైన రాజకీయ సంస్కృతి కాదన్నారు. ఎమ్మెల్యే ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని, రైతులు, యువత, మహిళలు, దళితులు, బీసీలు, అభి వృద్ధి, సాగునీరు, నిధులు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రజల మద్దతుతో పనిచేస్తున్న నాయకులను వ్యక్తిగతంగా కించ పరచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో అంతి మ తీర్పు ప్రజలదేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, హుందాతనం పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

**దేశిని కోటి నోరు అదుపులో పెట్టుకో: వైస్ చైర్మన్ జావేద్**

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేత దేశిని కోటికి లేదని నిజాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నీవు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై నోరు జారితే నియోజకవర్గంలో తిరుగనీయమని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని తెలిపారు. ఇంకొకసారి ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జావేద్ హెచ్చరించారు.

# మెరుగైన విద్యుత్ అందించాలని అధికారులకు వినతి



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల గోవిందపూర్ వాగును ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫా ర్మర్ ప్రస్తుతం ఓవర్‌లోడ్ సమస్యను ఎదుర్కొంటోంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా పరిసర ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన మోటార్లు నడుస్తుండటంతో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందించిన మూడో వార్డు సభ్యులు బండారి ప్రశాంత్. ఈ సమస్యను గుర్తించిన వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ 3వ వార్డు మెంబర్ బండారి ప్రశాంత్, జమ్మికుంట విద్యుత్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ అవసరాలకు సరిపడే సామర్థ్యం కలిగిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన విద్యుత్ అధికారులు సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ప్రశాంత్ పేర్కొన్నారు.

# వావిలాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**జమ్మికుంట, (సింగిడి):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకుహర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట బీజేపీ మండల అధ్యక్షుడు దొంతరవేన రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థి,విద్యార్థినిలతో కలిసి గ్రామ ప్రజలతో కలిసినాయకులు ,కార్యకర్తలతో అందరితో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీని వావిలాల గ్రామంలో ర్యాలీని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా కేవలం మూడు రంగుల వస్త్రం కాదని ఇది మన స్వతంత్ర పోరాటానికి ప్రతీక మన దేశ ఐక్యతకు చిహ్నం కోట్లాది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతిరూపమని అన్నారు. జాతీయ జెండాను ప్రతి ఒక్కరు గౌరవించాలని ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు జమ్మికుంట మండల బిజెపి ఇంచార్జ్ పుప్పాల రఘు, మాజీ జమ్మికుంట మండలాధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, వావిలాల బూత్ అధ్యక్షులు మేడిపల్లి సమ్మయ్య, పాపక్కపల్లె బూత్అధ్యక్షులు మేరుగు శ్రీనివాస్, వావిలాల బిజెపి సీనియర్ నాయకులు వీరగొని రాజయ్య, బిజెపి జమ్మికుంట మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు కంకణాల స్వరూప రాణి, గోపాలపురం బూత్ అధ్యక్షులు రమణాకర్ రెడ్డి గారు, మాజీ సర్పంచ్ బండారి తిరుపతి, బిజెపి సీనియర్ నాయకులు వీర్ల సాంబమూర్తి, బండారి బాలు, తోడేటి శ్రీనివాస్, బాసాని సత్తయ్య పోల్సాని పురుషోత్తం రావు, అంకుశపురం గ్రామ సర్పంచ్ కావిడి కుమార స్వామి, తిరుపతి, చెట్టి హరీష్, మ హేందర్, కంకణాల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ సంపత్, లింగారావు గొడుగు అంజి, జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి పూల్లూరు ఈశ్వర్ , పాపక్కపల్లె వార్డ్ మెంబర్ అడ్డాల రవళి – తిరుపతి,పాపక్కపల్లె లింగాల రమేష్ పుట్టకోకుల కుమార్ సురేందర్, విజేందర్, బాలరాజు వెలుపల మధునయ్య, రుద్రవరం శివానంద చారి, మడిపల్లి విక్రం, మొగుల మొగిలి, పాల్గొన్నారు.

### హర్ ఘర్ తిరంగా ర్యాలీలో

# పారమిత ఎన్‌సీసీ కేడెట్లు


## త్రివర్ణ పతాకాలతో ర్యాలీగా వెళ్లి దేశభక్తిని చాటిన విద్యార్థులు



**కరీంనగర్, (సింగిడి):** జాతీయ గీతం 'వందే మాతరం' 150 సంవత్సరాల వేడుకల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా–2026 కార్యక్రమాన్ని మంకమ్మతోటలోని పారమిత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ఘనంగా నిర్వహించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. పారమిత ఉన్నత పాఠశాల నుంచి మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రాంగణం వరకు సుమారు 100 మంది ఎన్‌సీసీ కేడెట్లు త్రివర్ణ పతాకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. నగర వీధుల్లో 'వందే మాతరం' ఆలపిస్తూ, జాతీయ గీతం గొప్పతనాన్ని చాటుతూ దేశభక్తిని ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేడెట్లను పాఠశాల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వియు. యం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యా యులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు శ్రీనాథ్, చంద్రసేన, ఎన్‌సీసీ అధికారి ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొని కేడెట్లను అభినందించారు.

# గోశాలకు రూ.40 వేల పశుగ్రాసం సాయం

## మూగజీవాల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: గోశాల నిర్వాహకులు



**కరీంనగర్, (సింగిడి):** గిరిజా గోశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మృత్యుంజయ మహాదేవాలయం గోశాల వ్యవస్థాపక చైర్మన్ పురాణం మహేశ్వరి శర్మ సారథ్యంలో నిర్వహిస్తున్న గోశాలకు పశు గ్రాసం కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూ. 40 వేల ఆర్థిక సహాయం అందించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నల్ల లింగారెడ్డి తన శాఖ నిర్వహణ నుంచి రూ. 40 వేల చెక్కును గోశాల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, గోశాల కార్యదర్శి చల్ల మోహన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సంఘ్యం లక్ష్మణరావు, పశుసంవర్ధక శాఖ మంత్రిత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు మాట్లాడుతూ మూగజీవాల సంరక్షణకు ఆర్థిక సహాయం అందించిన నల్ల లింగారెడ్డి, పశు సంవర్ధక శాఖ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. గోవులు పాలు, సేంద్రియ ఎరువు ద్వారా రైతులకు, వ్యవసాయానికి, సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆహారం, నీరు, వైద్యం, ఆశ్రయం కల్పిస్తూ మూగజీవాలను సంరక్షించడం మానవతా సేవతో సమానమని అన్నారు. గోవులు, మూగజీవాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, గోశాల నిర్వహణకు పశుగ్రాసం, వైద్యం తదితర అవసరాల కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# మెడికవర్‌లో ప్రతినెల రెండో గురువారం ఉచిత క్యాన్సర్ శిబిరం

## తొలి శిబిరంలో 186 మందికి పరీక్షలు.. 26 మందికి క్యాన్సర్ నిర్ధారణ, మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ



**కరీంనగర్, (సింగిడి):** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ తెలిపారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహిం చిన ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరానికి 186 మంది హాజరై వివిధ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి క్యాన్సర్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇకపై ప్రతి నెల రెండో గురువారం ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలి పారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగా హన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ కరీంనగర్‌లో ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. లక్షణాలు బయటపడకముందే పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి సకాలంలో చికిత్స అందించవచ్చన్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే దశ పెరిగే కొద్దీ చికిత్స క్లిష్టతరమవుతుందని హెచ్చరించారు. ఊబకాయాన్ని నియంత్రించు కోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవ డం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. ప్రజలు ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకుని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెడికవర్ కేంద్రం అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కేంద్రం అధిపతి సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్నాకర్, ప్రజా సంబంధాల అధికారి అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అభివృద్ధి పనులకు స్థల పరిశీలన



**జమ్మికుంట, (సింగిడి)::** దక్షిణ మధ్యరైల్వే సంస్థ ఆధ్వర్యంలో రైల్వేలైన్ విస్తరణ అభివృద్ధిలో భాగంగా లెవెల్ క్రాసింగ్ లైన్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి అండర్ బ్రిడ్జి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మడిపల్లి, పాపయ్యపల్లి గ్రామాల మధ్య నిర్మించే రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనుల కొరకు పరిశీలన చేయడం జరిగింది. రెండు గ్రామాల ప్రజలకు నిర్మించబోయే విధానాలను గురించి వివరించడంతోపాటు వారి సూచనలు సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో హుజరాబాద్ ఆర్డిఓ జల కుమారి, తాసిల్దార్ సుధాకర్, ఆర్ ఐ శంకరయ్య సత్యనారాయణ, తో పాటు పంచాయతీ డిపార్ట్మెంట్ మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భర్త చేతిలో చేయి వేసి..

## రష్మిక పోస్ట్ వైరల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక తాజాగా ఇంట్రెస్టింగ్ పోస్ట్ చేశారు. తన భర్త విజయ్ దేవరకొండ చేతిని పట్టుకొని ఉన్న చిత్రంతో పాటు తన స్మైలీ ఫోటోలను పంచుకున్నారు. షూటింగ్ లో గాయపడిన కారణంగా ఇంటికే పరిమితమైన హీరోయిన్ రష్మిక, ప్రస్తుతం తన హెల్త్ బాగుందని చెప్పే క్రమంలో ఈ పోస్ట్ చేశారు. బిజీగా ఉండే లైఫ్ నెమ్మదించినప్పుడు భయంకరంగా అనిపిస్తుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. కానీ, అలాంటి సమయంలో పిచ్చి వాళ్ల లాగా పరిగెత్తడం కూడా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. జీవితమంటే ఇదేనేమో...? ప్రేమ పూర్వక మనుషుల మధ్య గడపడం అద్భుతంగా ఉంటుందని తాజాగా చేసిన పోస్టు సందర్భంగా రాసుకొచ్చారు హీరోయిన్ రష్మిక. ఇది ఇలా ఉండగా మైసా షూటింగ్ లో ఒక హై ఎనర్జీ డాన్స్ సీక్వెన్స్ చేస్తున్నప్పుడు హీరోయిన్ రష్మిక కుడి తొడ భాగంలో గాయమైంది. దీంతో ఆరు వారాల పాటు రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో హైదరాబాద్ లోని విజయ్ దేవరకొండ ఇంట్లోనే ఆమె ఉంటున్నారు.

## ఫోన్ వల్లే రూ. 3లక్షల ఖర్చు..

# నరకయాతన

## నటి షకీల



ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమెవెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు . “ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి” అని షకీల కోరారు. 18 ఏళ్ల వయసులో ‘ప్లే గర్ల్స్’ అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం ‘కిన్నార తుంబికల్’ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన ‘జయం’ సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.



# నేను బరువు తగ్గను..

## ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన స్వరా భాస్కర్



బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ తనను దారుణంగా ట్రోల్ చేస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పారు. పెళ్లై, పాప పుట్టిన తర్వాత ఆమె కాస్త లావు అవ్వడంతో కొంతమంది నెటిజన్లు ఆమె రూపంపై దారుణమైన కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. ఈ విషయంపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన స్వరా, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒకరి బరువు గురించి మాట్లాడటానికి మీకు అంత ఖాళీ సమయం ఉందా అని స్వరా ప్రశ్నించారు. “నా జీవితం మీ మాటలపై నడవదు. అందంగా కనిపించే అమ్మాయిలను చూడాలనుకుంటే వేరే పేజీలు చూసుకోండి, నా ప్రొఫైల్‌కు రావాలని మిమ్మల్ని ఎవరూ అడగలేదు” అని తెగేసి చెప్పారు. ఒక మహిళ తల్లి అయిన తర్వాత ఆమె శరీరంలో మార్పులు రావడం చాలా సహజమని గుర్తుచేశారు. సినిమాలో ఎప్పుడూ అందంగా కనిపించాలని సర్జరీలు, ఇంజెక్షన్లు చేయించుకోవడం సాధారణమే కావచ్చు కానీ, కాలంతో పాటు మన రూపురేఖలు మారడం సహజమని చెప్పారు. గతంలో తన భర్త ఫహద్‌తో కలిసి బయటకు వెళ్లినప్పుడు మేకప్ లేకుండా ఉన్న ఫోటోలను కావాలనే వైరల్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే మతం ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవడం వల్లే ఇలా అయ్యానంటూ కొందరు కామెంట్లు చేశారని, అది తన భర్తను కూడా బాధించిందని చెప్పారు. అయితే ఇలాంటి కామెంట్లకు తాను భయపడేది లేదని స్వరా స్పష్టం చేశారు. “మీరు విమర్శిస్తున్నారని నేను బరువు తగ్గను, పైగా ఇంకా లావుగా ఉన్న ఫోటోలనే సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాను” అని సవాల్ విసిరారు. ఆడవాళ్లు ఏ రంగంలో ఉన్నా ఇలాంటి సమస్యలను తట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఒక జనరేషన్‌ను మార్చే సినిమా

# హుసార్ పిట్టలు

## యంగ్ నటి వాసవి గణేషన్



యంగ్ నటులు అన్ష్, వాసవి గణేషన్ జంటగా నటించిన లేటెస్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం ‘హుషార్ పిట్టలు’. బిక్షు దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన కంటెంట్‌తో సినిమాపై యూత్‌లో ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్ని అంటాయి. నెట్టింట సొంతం చేసుకున్న విశేష ఆదరణతో ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు ఆగస్టు 15న భారీ ఎత్తున విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్ నటి వాసవి గణేషన్ మాట్లాడుతూ.. ‘ఈ సినిమా ప్రివ్యూ చూసి అందరూ ఎంజాయ్ చేస్తున్నారు.. పెద్ద స్క్రీన్‌పై సినిమా చూస్తూ పెద్ద పెద్ద కేకలు వేస్తున్నారు.

వాళ్లు అలా ఎంజాయ్ చేస్తుంటే.. అరే ఈ సీన్ చేసినప్పుడు మేము ఇంత కష్టపడ్డాము కదా, మా కష్టానికి ఫలితం దక్కింది అనే ఆనందం వేస్తుంది. మా సినిమాకు వస్తున్న ప్రివ్యూస్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా మా అమ్మమ్మ ఏజ్ ఉన్న వాళ్ళు వాళ్ల మనవరాళ్లతో వచ్చి ఈ సినిమా చూస్తు ఎంజాయ్ చేస్తున్నారు. వాళ్లు నా దగ్గరకు వచ్చిన తప్పకుండా హిట్ అవుతుంది, ఇది ఒక జనరేషన్ ను మార్చే సినిమా అని చెబుతుంటే నాకు చాలా సంతోషంగా అనిపించింది. వాళ్ల మనవరాళ్లు కూడా ‘అక్క ఇలా జరుగుతుందా అక్కా.. నేను ఇలా చెయ్యను అక్కా.. మా వాళ్లను మంచిగా చూసుకుంటా’ అని చెబుతున్నారు. ఇంత బాగా అర్థం చేసుకుని మంచి మంచి రివ్యూస్ ఇస్తున్నారు’ అంటూ ఆనందం వ్యక్తం చేసింది వాసవి.

# ఫుల్ యాక్షన్ మోడ్‌లో తాప్సీ..

## వైరల్ ఫొటోస్‌తో ‘గాంధారి’పై భారీ హైప్

తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘గాంధారి’. ఇష్వాక్ సింగ్, స్వస్తిక ముఖర్జీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీకి దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నాడు. కథ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ త్వరలో నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ అప్డేట్ నెట్టింట వైరల్ అవుతున్నది. ఈ సినిమా కోసం తాప్సీ శారీరకంగా ఎంతో శ్రమ చేస్తున్నట్లు తెలుస్తోంది. మహాభారతంలోని గాంధారి పాత్ర స్ఫూర్తితో, ఆధునిక సమాజంలో ఒక తల్లి, అలాగే భార్య కోణంలో ఎదురయ్యే భావోద్వేగ ప్రాధాన్యతల్ని నేటి శైలిలో ఈ సినిమాలో చూపించనున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం తాప్సీ కెరీర్‌లో మరొక ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా నిలవనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకోసమే ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం తాప్సీ కష్టపడుతూ తనను తాను మేకోవర్ చేసుకుంటుందని తెలుస్తుండగా.. అందుకు సంబంధించిన ఫొటో ఒకటి నెట్టింట వైరల్ అవుతూ సందడి చేస్తుంది. దీంతో ఈ సినిమా తాప్సీకి నిజంగా మంచి కమ్ బ్యాక్ ఇస్తుందంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు నెటిజన్లు.




## ఆ పాత్ర కోసం మారడానికి

# ఇబ్బందిగా అనిపించింది

## కామాక్షి భాస్కర్ల



కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సినిమా ‘అగధ’. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అజయ్ కేఆర్ సమర్పణలో, కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మించారు. సీనియర్ దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో జోవికా విజయ్ కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్ కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా మలేర్, కనకవ్వ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఒక ఇంటర్వ్యూలో కామాక్షి భాస్కర్ల తన పాత్ర గురించి, కెరీర్ ఎంపికల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాలో తాను పోషించిన ‘మహాదేవి’ పాత్రలోకి మారడానికి తనకు చాలా సమయం పట్టిందని కామాక్షి వెల్లడించారు. తన వ్యక్తిగత అలవాట్లను, సూత్రాలను పక్కన పెట్టి ఆ పాత్రలో ఒదిగిపోవడానికి మొదట్లో కాస్త ఇబ్బందిగా అనిపించినా, దేవుడి అనుగ్రహంతోనే ఇలాంటి గొప్ప పాత్రలు లభిస్తాయని చెప్పారు. ఈ క్యారెక్టర్ కోసం బుద్ధిజం పుస్తకాలు చదివానని, బ్లాక్ మ్యాజిక్ గురించి విషయాలు తెలుసుకున్నానని తెలిపారు. సినిమాలో ఉపయోగించే ప్రతి ముద్రను, పాత్ర నడవడికను క్షుణ్ణంగా అర్థం చేసుకుని నటించానని, తెరపై ఎక్కడా కామాక్షి కనిపించకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నానని పేర్కొన్నారు. అలాగే సాధారణంగా గ్లామర్ పాత్రలు చేయకపోవడంపై స్పందిస్తూ.. ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేయడం తనకు నచ్చదని స్పష్టం చేశారు. మన ఇంట్లోని మహిళలను ప్రతిబింబించే సహజమైన పాత్రలను పోషించడమే తనకు ఇష్టమని చెప్పారు. “మన ఇంట్లో వాళ్లు నన్ను తెరపై చూసినప్పుడు.. అరె, నా లాగే ఉందే అని అనిపించాలి. ఒక తెలుగమ్మాయిగా మన తెలుగు మహిళల జీవితాలను తెరపై నేను ప్రతిబింబించకపోతే ఇంకెవరు చేస్తారు?” అని ఆమె ప్రశ్నించారు. అందుకే తనకు గ్లామర్ లేదా రాయల్ క్వీన్ పాత్రల కంటే మన ఇంటి ఆడపడుచులా కనిపించే సాధారణ మహిళా పాత్రలే ఎంతో ఇష్టమని కామాక్షి భాస్కర్ల వివరించారు.



సినిమా సింగిడి
Cinma Singidi

శుక్రవారం
14-8-2026

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090